కరీంనగర్ వార్త
కరీంనగర్ - జగిత్యాల - పెద్దపల్లి - రాజన్నసిరిసిల్ల
బుధవారం 26, మార్చి 2025 | 16 పేజీలు

## యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలి



16లో.. కలెక్టర్ పమేలా సత్పతి

# ఖాకీ పోస్టింగ్స్... వెరీ కాస్ట్లీ గురూ



2 లో..

### సూట్ కేసులు రెడీ.. బదిలీలే ఆలస్యం

### అసలేం జరుగుతుంది



**కరీంనగర్ క్రైమ్,ప్రభాతవార్త:** కరీంనగర్ కమిషనరేట్ లో పోలీసుల బదిలీలు, పోస్టింగుల్లో ఏం జరుగుతుంది..పారదర్శకత, నిజాయితీ కొలమానం అనేది అక్కడ పూర్తిగా లేకుండపోయి పోలీస్ శాఖలో బదిలీలు, పోస్టింగ్స్ లో రాజకీయ రంగు పులుముకుంది... లంచాల సూట్ కేసులు రెడీ చేసుకున్న అధికారులు ఇక పోస్టింగులే ఆలస్యం అన్నట్లు ఉంది... గత కరీంనగర్ పోలీస్ కమిషనర్ హయంలో కమిషనరేట్ లో పని చేయడానికి ఇష్టపడని కొంతమంది అధికారులు ఇప్పుడు జిల్లాకు తిరిగి వచ్చేందుకు మళ్ళీ పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది..

**బదిలీలకు రాజకీయ రంగు:** ఒకనాడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కోల్ సిటీ ప్రాంతంలో పోలీస్ స్టేషన్ ల పోస్టింగ్ కోసం లక్షల్లో లంచాలు ఇచ్చి అక్కడ పనిచేసి కోట్లలో సంపాదించేవారు.. మరి ప్రస్తుతం కరీంనగర్ కమిషనరేట్ లో మానకొండూర్, తిమ్మాపూర్, చొప్పదండి, జమ్మికుంట పోలీస్ స్టేషన్ పోస్టింగ్స్ ఎక్కువ ధర పలుకుతున్నాయి.. ఆ పోస్టింగ్స్ సొంతం చేసుకొని కోట్లలో సంపాదనే ధ్యేయంగా పోలీసు అధికారులు, కొంతమంది రాజకీయ నేతల ఇంటి దగ్గర సూట్ కేసులు పట్టుకొని పడిగాపులు కాస్తూ,పైరవీలు చేస్తుండటం జిల్లాలో చర్చనీయాంశం అయింది...

## చత్తీస్‌ఘడ్‌లో.. మరో ఎన్‌కౌంటర్

# ఐదుగురు మావోయిస్టుల మృతి..





2 లో..

### మృతుల్లో ఎస్‌జెడ్‌సిఎం నేత సుదీర్..

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త: చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని దండకారణ్య ఆదివాసీగుడాలలో నిత్యం ఎక్కడో ఒక చోట ఎదురుకాల్పుల్లో, నెత్తుటి దారాలతో పచ్చటి చెట్ల ఆకులు రక్తపు దారాల్లో మునిగితేలుతున్నాయి. నాలుగు రోజుల క్రితం చత్తీస్‌ఘడ్‌లో రెండు చోట్ల జరిగిన ఎన్‌కౌంటర్‌లో 30మంది మావోయిస్టులు మృతి చెందగా, తిరిగి మంగళవారం చత్తీస్‌ఘడ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా బీజాపూర్ ప్రాంతంలోని గీడం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గిర్సపడ, నిల్లోడ, బోడ్గా, ఇకలి గ్రామాల సరిహద్దు ప్రాంతాల్లో నక్సలైట్లు సంచరిస్తున్నారన్న పక్కా సమాచారంతో..



2 లో..

## టి.డి.ఎస్ సొమ్ము స్వహా

# సూత్రధారి, పాత్రధారి ఎవరు?

### రైల్వే భూనిర్వాసితుల డబ్బుల స్వహాపై రైతులు ఆగ్రహం

### ప్రభుత్వ అధికారు? ప్రవేట్ టాక్సీ ప్రాక్టీస్ అన్నారైనా?

### సుమారు కోటి రూపాయలు చేతులు మారిన వైనం

### విచారణలో తేలన్న నిజా నిజాలు



**జగిత్యాల బ్యూరో, ప్రభాతవార్త:** రైల్వే లైన్ భూనిర్వాసితులకు సంబంధించిన టిడిఎస్ సొమ్ము సుమారు కోటి రూపాయల వరకు స్వహాసేసిన వ్యవహారంపై కేంద్ర ఐటి అధికారులు విచారణ చేపట్టారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం లో టీడీఎస్ కు సంబంధించి సొమ్ము కాజేసిన ఘటనలో సూత్రధారి, పాత్రధారి ఎవరన్నదానిపై కేంద్ర ఐటి అధికారులు లోతుగా విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో గతంలో పనిచేసిన ఆర్డీవో కార్యాలయం లోని ఓ కీలక అధికారి తోపాటు జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేటు టాక్స్ ప్రాక్టిషనర్ ఈ వ్యవహారానికి తెరలేపినట్లు సమాచారం. జిల్లాలో 2006లో రైల్వేలైన్ మం జూరైన సమయంలో దాదాపు 198 మందికి చెందిన రైతులకు సంబంధించి భూములు కోల్పోయారు.దీనికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించింది. నష్టపరిహారం తక్కువ రావడంతో 2019లో భూ నిర్వాసితులు కోర్టుకెళ్లగా అధికమాతంలో డబ్బులు బ్యాంకులో జమ అయినాయి.

# చత్తీస్‌ఘడ్‌లో.. మరో ఎన్‌కౌంటర్ ఐదుగురు మావోయిస్టుల మృతి..

మొదటి పేజి తరువాయి..

దంతెవాడ డిఆర్జి, బస్తర్ ఫైటర్స్, ఎస్‌టిఎఫ్, కోబ్రా, స్పెషల్ పోలీస్ పార్టీ బలగాలు కుంబింగ్ నిర్వహిస్తుండగా, తారాసపడిన మావోయిస్టులు ఒక్కసారిగా కాల్పులు జరపడంతో, ఎదురుకాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందినట్లు దంతెవాడ పోలీస్ సూపరిండెంట్ గౌరవ్‌రాయ్ విలేకరులకు తెలిపారు. ఈ ఎదురుకాల్పులు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం వరకు హోరాహోరిన జరిగినట్లు వెల్లడించారు. సంఘటన స్థలంలో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను స్వాదీనం చేసుకోగా, ఎన్‌కౌంటర్ స్థలం నుండి ఇన్సాస్ రిఫైల్, త్రినాట్‌త్రి, టువెల్‌బోర్ రైఫిల్, పేలుడు పదార్దాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారిలో తెలంగాణ రాష్ట్రం హన్మకొండ జిల్లా ఖాజీపేట మండలం తరాలపల్లి గ్రామానికి చెందిన ఎస్‌జెడ్‌సిఎం సభ్యులు సుదీర్ అలియాస్, సుదాకర్ అలియాస్, మురళి, చత్తీస్‌ఘడ్ రాష్ట్ర బీజాపూర్ జిల్లాకు చెందిన పాండ్రు అత్ర, మన్ను బార్సాతో పాటు మరో ఇద్దరు ఎన్‌కౌంటర్‌లో హతమైనట్లు దంతెవాడ పోలీస్ అధికారులు వెల్లడించారు. ఇది ఇలా ఉండగా, సుదీర్‌పై అక్కడి ప్రభుత్వం 25లక్షల రివార్డు ప్రకటించినట్లు పోలీస్ ఉన్నతాదికారులు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బస్తర్ ప్రాంతంలోని ప్రజల శాంతిభద్రత పరిరక్షణలో భాగంగా ఆ ప్రాంత ప్రజల అభివృద్ధి కోసం బలమైన నైతికత, స్పష్టమైన లక్ష్యాలతో అంకితభావంతో ఇక్కడ పోలీస్ యంత్రాంగం పనిచేస్తున్నారని బస్తర్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ పి సుందర్‌రాజన్ విలేకరులకు తెలియజేసారు. 2025వ సంవత్సరం ఈ మూడు మాసాల కాలంలో బస్తర్ డివిజన్ ఏరియా ప్రాంతంలో భద్రత దళాలు నిషేదిత మావోయిస్టులను పలు ఎన్‌కౌంటర్‌లలో వందమందికి పైగా ఎదురుకాల్పుల్లో మృతి చెందినట్లు ఐజి సుందర్‌రాజన్ వెల్లడించారు. మృతి చెందిన మావోయిస్టులను ఇంక గుర్తించే పనిలో అధికారులు నిమగ్నమై ఉన్నట్లు తెలిపారు. ఇక్కడ నిత్యం జరుగుతున్న యుద్ధ వాతవారణంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అపరేషన్ కగార్‌లో 2026 మార్చి 31వరకు నక్సల్స్ రహిత భారత్‌గా నిలుస్తామన్న అన్న మాటలను ఇక్కడ భద్రత బలగాలు ఆ దిశగానే అడుగులు వేస్తున్నాయి. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని బస్తర్, బీజాపూర్, నారయణపూర్, కాంకేర్, దంతెవాడ, అటు మహారాష్ట్ర, ఇటు ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, తెలంగాణ సరిహద్దుల్లో భద్రత బలగాలు కట్టుదిట్టమైన నిఘా ఏర్పాట్లు చేసి, దండకారణ్యం నుండి మైదాన ప్రాంతాలకు నక్సల్స్ పారిపోకుండా చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తుంది. ఇన్ని సంఘటనలు జరుగుతున్న ఈ ఆకులు రాల్చే కరువు కాలంలో మావోయిస్టుల సంఖ్యబలం తగ్గిన, ఎదురుకాల్పుల్లో నిత్యం మృతి చెందుతూనే ఉన్నారు. మంగళవారం జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో తరాలపల్లి గ్రామానికి చెందిన ఎస్‌జెడ్‌సిఎం సభ్యులు సుదీర్ మాల సామాజిక వర్గానికి చెందిన వాడని గ్రామస్తులు తెలిపారు. చిన్నతనంలోనే సుదీర్ తల్లిదండ్రులు చనిపోయారని తెలిసింది. అప్పటి వరంగల్ జిల్లాలో సుదర్శన్ రెడ్డి అలియాస్ ఆర్కె పనిచేస్తున్న రోజుల్లో (1993లో) తరాలపల్లి గ్రామం నుండి సుదీర్ అండర్‌గ్రౌండ్‌లోకి వెళ్లినట్లు గ్రామస్తులు వెల్లడించారు. పర్కాల, నర్సంపేట, చిట్యాల ప్రాంతాలలో చాలా కాలం పనిచేసిన అనంతరం మావోయిస్టు పార్టీ చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని దండకారణ్య ప్రాంతానికి సుదీర్‌ను పంపినట్లు తెలుస్తుంది. సుదీర్ ఎక్కువ కాలం ఆదివాసీ గుడాలలో అక్కడి ఆదివాసీలకు వ్యవసాయం, విద్యపై ప్రజల్లో చైతన్యవంతం చేసినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం నార్త్ తెలంగాణ సెం ట్రల్ జోనల్ బాధ్యతలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. మంగళవారం సాయంత్రం పొద్దుపోయాక వరంగల్ పోలీస్ అధికారులు తరాలపల్లి గ్రామానికి వెళ్లి మృతి చెందిన సుదీర్ సొదరుడు రవికి మృతిచెందారన్న సమాచారం అందించి, అక్కడి నుండి మృతదేహాన్ని తీసుకురావల్సిందిగా గ్రామస్తులు తెలిపారు. తరాలపల్లిలో 30సంవత్సరాల ప్రజ ఉద్యమంలో పనిచేసిన సుదీర్‌ను గ్రామస్తులు పిల్చుకునే అంకేసారపు సారయ్య మృత్యువాత ఆ గ్రామంలో విషాదాన్ని నింపాయి.

# ఖాకీ పోస్టింగ్స్.. వెరీ కాస్ట్లీ గురూ

మొదటి పేజి తరువాయి..

ఇటీవలి కాలంలో కరీంనగర్ కమిషనరేట్ లో పోస్టింగ్ వచ్చిన అక్కడ పనిచేయకుండా, ఓ రాజకీయ నాయకుడిని ప్రసన్నం చేసుకుని వేరే పోలీస్ స్టేషన్ పోస్టింగ్ కి వెళ్లి,మళ్ళీ కమిషనరేట్ పోస్టింగ్ కి రావాలని చూస్తుండటం పోలీస్ వర్గాల్లో సైతం చరణీయాంశమైంది.. ఏది ఏమైనప్పటికీ పోస్టింగులు, బదిలీల కోసం లక్షల్లో డబ్బులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న వారిని చూసి చూడనట్లు ఉన్నతాధికారులు వ్యవహరిస్తుండటం గమనార్హం.అంతేకాకుండా లంచం ఇవ్వడం,తీసుకోవడం తప్పని తెలిసినప్పటికీ జిల్లా అవినీతి నిరోధక శాఖ అధికారులు కూడా అటూ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు..అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో అవినీతికి వ్యతిరేకంగా పోస్టర్లు అతికించే ఏసిబి అధికారులు,జిల్లాలోని ఏ ఒక్క పోలీస్ స్టేషన్ లో పోస్టర్లు ఏర్పాటు చేయకపోవడం మాత్రం శాఖపై ఉన్న మమకారం అనుకోవచ్చు..మరి ఈ అవినీతి తతంగంలో ఎవరి వాటా ఎంత అనేది లెక్కలు తేలాలంటే ఆ శాఖల ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరిపితే మాత్రమే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది...

# టిడి.ఎస్ సొమ్ము స్వహా సూత్రధారి, పాత్రధారి ఎవరు?

మొదటి పేజి తరువాయి..

కాగా ఆర్డీవో కార్యాలయంలో అధికారులు ఈ నష్టపరిహారాన్ని డిపాజిట్ చేశారు. ఆదాయపు పన్ను శాఖ వారు పాన్ కార్డు ఉన్న రైతుల నుంచి 10 శాతం, 37మంది రైతుల పాన్ కార్డు లేని వారు నుంచి 20 శాతం చొప్పున టీడీఎస్ కట్ చేశారు. కాగా 37 మంది రైతులకు పాన్కార్డు లేకపోవడంతో వారి సొమ్మును క్లెయిమ్ చేసుకునేం దుకు ఓ అధికారి, టాక్సీ ప్రాక్టీస నర్ ఒకటై లక్షల సొమ్మును స్వాహా చేసినట్లు తెలిసింది. కాగా టీడీ ఎస్ సొమ్ముకు సంబంధించిన భూ నిర్వాసితుల వివరాలు రెవెన్యూ అధికారులు ఇచ్చినప్పటికీ వారి పేర్లు కాకుండా ఇతరుల పేర్లపై పాన్ కార్డులు పెట్టి క్లెయిమ్ చేసి సొమ్ము కాజేసినట్లు కేంద్ర ఇన్కమ్ టాక్స్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఇటీవల ఆర్డీవో కార్యాల యంలో ఈనెల 20 గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆర్డిఓ కార్యాలయ అధికారులను విచారణ చేపట్టి, వారి వాంగ్మూలాలను రికార్డు చేసి, రికార్డులు తనిఖీ చేసి జిరాక్స్ ప్రతులు తీసుకెళ్లారు.. సూత్రధారి, పాత్రధారి ఎవరన్నదానిపై కేంద్ర ఎన్ కాంటాక్ట్స్ అధికారులు విచారణ చేపడుతున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకొని డబ్బులు రికవరీ చేయనున్నట్లు సమాచారం. దాదాపు 37 మంది రైతులకు చెందిన సుమారు రూ. కోటి రూపాయలవరకు గోల్మాల్ జరిగినట్లు తెలుస్తోంది. భూమి కోల్పోయిన రైతులకు సంబంధించిన డబ్బులు స్వహాసేయడంపై రైతులు తీవ్ర అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజులలో రైల్వే భూ నిర్వాసితుల టిడిఎస్ డబ్బులు స్వాహా చేసిన సూత్రధారులు పాత్రధారులు ఎవరన్నది తెలియ నున్నట్లు సమాచారం.

# పరోపకారి పరికిపండ్ల ఆలయ ఫౌండేషన్ అందించిన కృత్రిమ కాలు



*జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాతవార్త:*

గత 15సంవత్సరాలుగా స్వచ్చందంగా అభాగ్యులకు అండగా ఏర్పాటైన ఆలయ ఫౌండేషన్ పాత కరీంనగర్ జిల్లా పరిధిలో ఏ దిక్కు, మొక్కులేని గరిబోళ్లకు అన్నింటికి మేమున్నామంటూ అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రస్తుత మధ్యప్రదేశ్ రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నిజంగా.. ఈ పరికిపండ్ల నరహరి పరోపకారే. ఇటీవల అనేక మండలాల పరిధిలో జైపూర్ ప్రాంతానికి కృత్రిమ కాళ్లు, కృత్రిమ చేతులు, వీల్‌చైర్లు, కంటి ఆపరేషన్లు, పేద విద్యార్థులకు ఉచిత కోచింగ్ సెంటర్లు, అనేక విధాలుగా ఉపయోగపడుతున్న ఆలయ ఫౌండేషన్ మంగళవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని, అంబేద్కర్ కాలనీకి చెందిన వడ్లూరి పోచయ్య అనే కార్మికుడు ప్రమాదవశాత్తు ఇటీవల కుడికాలును కోల్పోయాడు. సంఘటన విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర కో ఆర్డినేటర్ గాదె గుణసాగర్ పోచయ్య కుటుంబ స్థితిగతులను తెలుసుకుని, ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరికిపండ్ల నరహరి దృష్టికి తీసుకెళ్లగా ఆయన చొరవతో హైద్రాబాద్ నగరంలోని శ్రీ భగవాన్ మహవీర్ ట్రస్ట్ సౌజన్యంతో పోచయ్యకు జైపూర్ కాలును తీసుకువచ్చి, వైద్యుల సహాకారంతో అమర్చారు. ఇప్పటికి ఆలయ ఫౌండేషన్ ఉమ్మడి కరీంనగర్, వరంగల్, అదిలాబాద్ జిల్లాలలో పేద, మధ్యతరగతి చెందిన అన్ని సామాజిక వర్గాల వారికి విద్య, వైద్య, ఉపాధి కార్యక్రమాలు నిర్వహిస్తుంది. అర్హులైన పేదలందరికి తాను స్థాపించిన ఆలయ ఫౌండేషన్ ద్వారా ఎల్లవేళలా సేవలందిస్తామని నరహరి తెలిపినట్లు గుణసాగర్ వెల్లడించారు. పోచయ్యకు కాలు అమర్చడం పట్ల అంబేదర్ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేసారు.

# ఛలో ఢిల్లీకి కదం తొక్కిన జమ్మికుంట యువజన కాంగ్రెస్ నాయకులు

*జమ్మికుంట టౌన్, ప్రభాత వార్త:*

ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ పిలుపు మేరకు చేపట్టిన " సంసద్ ఘోరావ్ పార్లమెంట్ ముట్టడి " కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల నాయకులు ఛలో ఢిల్లీ కార్యక్రమానికి కదం తొక్కారు. మంగళవారం ఢిల్లీ జంతర్ మంతర్ లో మార్చ్ ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ, నిరుద్యోగుల పక్షాన ఉద్యోగం ఇవ్వండి కానీ సంకెళ్ళు కాదు అంటూ నినాదాలు ఇచ్చి పార్లమెంటు ను ముట్టడి చేశారు. దేశవ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం నియంతృత్వ పరిపాలనకు వ్యతిరేకంగా, అన్ని రాష్ట్రాల నుండి యూత్ కాంగ్రెస్ నాయకులు వేలాదిగా తరలి వెళ్లారు. బిజెపి నియంతృత్వ పోకడలకి నిరసనగా జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ భాను, ఛీఫ్ ఇంచార్జి కృష్ణా అల్లవారు ఆదేశాల మేరకి తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జీ సురభి త్రివేది ఆధ్వర్యంలో ఢిల్లీలో జరగిన " సంసద్ ఘోరావ్ "" పార్లమెంట్ ను ముట్టడి చేసి యువజన కాంగ్రెస్ ఐక్యతను చాటారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జమ్మికుంట మండల అధ్యక్షులు బుడిగె శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి బిజిగిరి శ్రీకాంత్, కార్యదర్శి యేబుషి అజయ్, కార్తీక్ పాల్గొన్నారు.



# ప్రభుత్వ పాఠశాలలను రక్షించే దిశగా బహుజన బడిబాట కార్యక్రమం

*కమలాపూర్, ప్రభాత వార్త:*

ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడమే లక్ష్యంగా కమలాపూర్ మండలం కన్నూరు గ్రామంలో మంగళవారం పల్లె ప్రశాంత్ గౌడ్ ఆధ్వర్యంలో బహుజన బడిబాట కార్యక్రమాన్ని చేపట్టారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య పెరుగుదల, విద్యార్థులకు వివిధ సౌకర్యాలు కల్పించడం, మధ్యాహ్న భోజనం అమలు అంశములపై దృష్టి సారించారు. విద్యార్థుల కనీస సౌకర్యాలైన, నాణ్యమైన విద్యను అందించడం, పిల్లలకు మధ్యాహ్న భోజన సౌకర్యాలు, బాల బాలికలకు ప్రత్యేకమైన మరుగుదొడ్లు, సురక్షిత మంచినీరు అందించడం లాంటి తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బిసి సంక్షేమ సంఘం మండల అధక్షుడు కత్తి రమేష్, బీఎస్పీ సీనియర్ నాయకులు మహేందర్ జీ, అచ్యుత్ కుమార్, గ్రామస్తులు వెంకన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ హాస్టల్ ను సందర్శించిన బిసి సంక్షేమ శాఖ డిప్యూటి డైరెక్టర్ రాం రెడ్డి

*కమలాపూర్, ప్రభాత వార్త:*

కమలాపూర్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర సంక్షేమ హాస్టల్ ను మంగళవారం హన్మకొండ జిల్లా బిసి సంక్షేమ శాఖ డిప్యూటి డైరెక్టర్ కమలాపూర్ మండల స్పెషల్ ఆఫీసర్ రామ్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, సౌకర్యాలను అందిస్తున్నాయని నిర్ధారించడానికి కమిషనర్ చేసిన ప్రయత్నాల్లో భాగంగా ఈ తనిఖీ జరిగింది. తనిఖీ సందర్భంగా రాంరెడ్డి భోజనశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. అలాగే వంటగది, స్టోర్ రూమ్‌ని కూడా సందర్శించారు. భోజనం సిద్ధం చేయడానికి ఉపయోగించే ఆహార ధాన్యాలు, కూరగాయలు, ఇతర పదార్థాల నాణ్యతను పరిశీలించాడు. విద్యార్థులకు అందిస్తున్న మెనూపై స్పెషల్ ఆఫీసర్ ఆరా తీయగా అందజేస్తున్న ఆహారంపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారం, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడం యొక్క ప్రాముఖ్యతను వివరించి చెప్పాడు. వంటగది, భోజన ప్రాంతాలలో పరిశుభ్రత, పరిశుభ్రత యొక్క ఉన్నత ప్రమాణాలను నిర్వహించాలని హాస్టల్ వార్డెన్ రాజన్నకి, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. స్పెషల్ ఆఫీసర్ హాస్టల్ గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించి విద్యార్థుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులు బాగా చదివి పరీక్షలు బాగా రాయాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించి విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాజన్న, ట్యూటర్ రాజు, సిబ్బంది భద్రయ్య, విజయ, రమ, విద్యార్థులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఆస్తులు కాపాడడం ప్రజాప్రతినిధుల బాధ్యత

**నర్సింగాపూర్ శివారులో ప్రభుత్వ భూమి అక్రమాపై మంత్రికి ఫిర్యాదు చేశా. విచారించి రెవెన్యూ అధికారులు స్వాధీనం ప్రభుత్వ భూమి ప్రజా అవసరాలకు ఉపయోగపడుతుంది అభివృద్ధితో పాటు ప్రభుత్వం భూములు కాపాడడం ప్రజాప్రతినిధిగా నా బాధ్యత**

**-ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి**

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



ప్రభుత్వ భూములు ,ఆస్తులు కాపాడడం ప్రజాపాతినిధు ల బాధ్యతగా భావించాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పేర్కొన్నారుజగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్లో మంగళవారం పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధిగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తో పాటు ప్రజా ఆస్తులు కూడా సంరక్షించడం బాధ్యత. అన్నారుఎస్ ఆర్ ఎస్ పి నిర్మాణ దశలో ధరూరు రెవెన్యూ గ్రామం నుండి 200 ఎకరాల భూమి సేకరించిన భూములు జగిత్యాలకు వరంగా మారాయి. అన్నారుప్రజా జీవితంలోకి అడుగు పెట్టినప్పటి నుండి జగిత్యాల భవిషత్ ను దృష్టిలో ఉంచుకొని ప్రజా ఆస్తులు రక్షించడం జరిగిందని పేర్కొన్నారుదరూర్ లో ప్రభుత్వ భూములు పరిరక్షించడం తో జగిత్యాల కలెక్టరేట్,ఎస్ పీ కార్యాలయం నిర్మించుకోవడం, జరిగింది. దేవాదాయ శాఖ ఆస్తులు రక్షించడం కూడా ప్రధానం గా భావించాను.ప్రజలు దేవుడి పైభక్తి తో ప్రభుత్వ సహకారం లేకుండా రామాలయం నిర్మాణం చేపట్టారు. భూములు అన్యాక్రాంతం కాకుండా ఉద్యమించినం.నర్సింగ్ పూర్ లో వందలాది ఎకరాలు గతంలో కొంతమంది అనర్హులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై కాజేసిన భూములు రక్షించాల్సిన బాధ్యత ఉంది.ధరణి ని ఆసరాగా చేసుకుని కొంతమంది సర్వే నంబర్ 437, 251లలోని భూములను రికార్డుల్లో అనర్హులు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై నమోదు చేసుకున్నారు.వ్యక్తిగతంగా కాదు..ప్రజా ఆస్తుల పరిరక్షణ బాధ్యత గా భావించిన.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్యాక్రాంతమైన భూమి వివరాలు తెలుపాలని జనవరి 18 న జిల్లా కలెక్టర్ కు లిఖిత పూర్వకంగా లేఖ రాశాను.ఏడాది తర్వాత సర్వే నంబర్ 437 కు సంబంధించిన వివరాలు మాత్రమే అందజేశారు.251 సర్వే లోని భూమి వివరాలు అందజేయాల్సి ఉంది.అన్యాక్రాంతం అయిన భూములు ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళాను.జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించారు.437 లో 90 ఎకరాల భూమి అనర్హుల పేర్లు చేర్చినట్లు గుర్తించి, చర్యలు చేపట్టారు.అసైన్మెంట్ భూమి 13.21 ఎకరాలు నిబంధనలు ఉల్లంఘించి క్రయ విక్రయాలు జరిగిన భూమితో పాటు 76 ఎకరాల 19 గుంటల భూమి స్వాధీనం చేసుకున్నారు. అన్యాక్రాంతమైన ఎకరాల 90 ప్రభుత్వ భూమిని కలెక్టర్ స్వాధీనం చేసుకోవడం పై హర్షం వ్యక్తం చేస్తున్న.ప్రజా ఆస్తులు పరిరక్షించాననే ఆత్మ సంతృప్తి మిగిలింది.నర్సింగ్ పూర్ గ్రామంలోని భూములు నిరుపేదలు, బలహీన వర్గాల అభివృద్ధి కి మొదటి ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు ప్రజావసరాలు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలి.అనర్హులు అని తెలిసి కూడా భూములు పట్టాలు చేసుకున్న వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలి.సర్వే నంబర్ 251 కు సంబంధించి కూడా అక్రమ పట్టాలు రద్దు చేసేందుకు చర్యలు చేపట్టాలి.న్యాయపరమైన చిక్కులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి.భవిష్యత్ లో ఇటువంటి పొరపాట్లు జరుగకుండా అక్రమనదారులపై చర్యలు తీసుకోవడం తో పాటు అక్రమంగా పట్టాలు చేసిన బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.జిల్లాలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు సైతం ఉన్నాయని,విచారణ చేపట్టి స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేస్తున్నా.నర్సింగ్ పూర్ లో ప్రభుత్వ భూములు జగిత్యాల కు ఒక వరమని, భవిషత్ తరాల అవసరాలకు ఉపయోగపడతాయని అన్నారు. ఆశించింది లభించనప్పుడు ఎవరికైనా కొంత అసంతృప్తి ఉండడం సహజమని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.నాలుగు దశాబ్దాలుగా వివిధ హోదాల్లో ప్రజలకు సేవలు అందించిన విషయం అందరికి తెలిసిన అని పేర్కొన్నారుజీవితం చివరి క్షణాల వరకు ప్రజలకు సేవలు అందిస్తాను. అన్నారునాలుగు దశాబ్దాలుగా ప్రజా సేవలు అందించిన అనుభవంతో హోదా ప్రధానం కాకుండా, ప్రజల కోసం పని చేస్తా..అని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బండ శంకర్, దుర్గయ్య ,రాధా కిషన్ రావు, రమేష్ బాబు,

## బిజెపి జిల్లా కార్యవర్గంలో పలువురి నియామకం

గోదావరిఖని, ప్రభాతవార్త:





బిజెపి పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికైంది. జిల్లా కార్యవర్గంలో గోదావరిఖనికి చెందిన పలువురు నాయకులు నియమితులయ్యారు. బిజెపి జిల్లా ఉపాధ్య క్షులుగా రామగుండంకు చెందిన ముస్కుల భాస్కర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రామగుండంకు చెందిన కోమల్ల మహేష్, అధికార ప్రతినిధిగా జక్కుల నరహరి, దళిత మోర్చ జిల్లా అధ్యక్షులుగా మచ్చ విశ్వాస్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా తన నియామానికి సహకరించిన బిజెపి జిల్లా అధ్యక్షులు కర్రె సంజీవ రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణ రెడ్డికి, కాశిపేట లింగయ్యకి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మెరుగు హనుమంతు గౌడ్‌కు, రామగుండం నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందుల సంధ్యారాణికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## నూతన రోడ్డు నిర్మాణం చేయాలి

**ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్**

గోదావరిఖని, ప్రభాతవార్త:

రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని 33వ డివిజన్ ప్రధాన గల్లీలోని దాదాపు 20 ఇండ్ల వరకు ఏళ్ల తరబడి రోడ్డు మరమ్మత్తు లేకపోవడం దురదృష్టకరమని, వెంటనే నూతన రోడ్డు నిర్మాణం చేయాలని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేష్ డిమాండ్ చేశారు. మంగళవారం డివిజన్ ప్రధాన గల్లీలోని ప్రజలను కలిసి మాట్లాడి సమస్యపై తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దినేష్ మాట్లాడుతూ అవసరం లేని చోట అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారని, సింగరేణి యాజమాన్యం 33వ డివిజన్‌ను దత్తత తీసుకొని అన్ని రకాలుగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. అదేవిధంగా రామగుండం నగర పాలక సంస్థ అధికారులు ఈ రోడ్డును పర్యవేక్షించి నిధులు విడుదల చేసి త్వరితగతిన రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా సుమారు ఇరవై ఇండ్ల దాక మంచి నీటి సరఫరా సరిగ్గా జరగక నీరు సరిపోవడం లేదని, మంచి నీటి సరఫరా పైప్‌లైన్‌కు మరమ్మత్తులు చేసి స్థానిక ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు.

## విధులు బహిష్కరించిన న్యాయవాదులు

గోదావరిఖని, ప్రభాతవార్త:



హైదరాబాద్‌లోని చంపాపేట్ ప్రాంతంలో ఇజ్రాయిల్ అనే న్యాయ వ్యాదిని పాశవికంగా హత్య చేయటాన్ని నిరసిస్తూ గోదావరిఖని న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ పిలుపు మేరకు న్యాయవాదులు మున్సిఫ్ కోర్ట్ కాంప్లెక్స్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. న్యాయవాదిని హత్యచేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని, న్యాయవాది రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్, ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్, కమిటీ కార్య వర్గ సభ్యులు గోసిక ప్రకాష్, పులిపాక ప్రవీణ్ కుమార్, వరలక్ష్మితోపాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు చందాల శైలజ, గొర్రె రమేష్, వేల్పుల అరుణ్, జాపతి రాజేశం, జూపాక వెంకట్, రంగు శ్రీనివాస్, నూతి సురేష్, సహనవాజ్, సంపల్లి రవీందర్, ప్రసన్న, అంజలి తదితరులు ఉన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

గోదావరిఖని, ప్రభాతవార్త:

ఉభయ తెలుగు రాష్ట్రాలలోని కవులకు, రచయితలకు, గాయకులకు, కళాకారులకు గద్దర్ గళం అవార్డ్స్‌తోపాటు, పలు రంగాలలో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులకు, పండితులకు, సంగీత, సాహిత్య, నృత్య, చిత్రలేఖన, శిల్ప, జానపద, మిమిక్రీ, ఇంద్రజాల, హరికథ, బుర్రకథ, ఒగ్గుకథ, కోలాటం విద్య, వైద్య రంగాలలో సేవలందిస్తున్న వారికి జాతీయ స్థాయి మానవత వెలుగు అవార్డ్స్ 2025 ఉగాది పురస్కారాల ప్రధానోత్సవం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్, లయన్ డాక్టర్ సురభి శ్రీధర్ తెలిపారు. ఈ పురస్కారాలకు ఏప్రిల్ 15 లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8977748838 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.




## పేకాట స్థావరంపై దాడి

**సిసిఎస్ పోలీసుల అదుపులో ఆరుగురి పేకాట రాయుళ్లు**

జగిత్యాల రూరల్ ప్రభాతవార్త:

జగిత్యాల మండలం రూరల్ వెల్దుర్తి గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తున్నారని పక్కా సమాచారంతో పేకాట స్థావరంపై సిసిఎస్ పోలీసులు దాడి చేయగా ఆరుగురు పేకాటరాయలను అదుపులోకి తీసుకున్నారు వారి వద్ద నుండి 25 వేల ఎనిమిది వందల తొంబై రూపాయలను స్వాధీనం చేసుకున్నారు మోతే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు స్థావరాలను ఏర్పరిచి పేకాట ఆడే వారి వద్ద నుండి డబ్బులు వసూలు చేస్తూ పేకాట స్థావరాలు నిర్వహిస్తున్నారని సమాచారం పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## దొంగతనం కేసులో నిందితునికి మూడు సంవత్సరాల జైలు శిక్ష

**- 6వేల రూపాయల జరిమానా**

వేములవాడ, ప్రభాతవార్త:

ఓ వ్యక్తిని మోసం చేసి 50వేల రూపాయలు దొంగతనం చేసిన కేసులో నిందితునికి 3 సంవత్సరాల కారాగార జైలు శిక్ష, 6వేల రూపాయలు జరిమానా విధిస్తూ వేములవాడ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పు ఇచ్చారని వేములవాడ పట్టణ సిఐ వీర ప్రసాద్ తెలిపారు. కొడిమ్యాల మండలం పుడూర్‌గర్‌కు చెందిన ఎంఎల్ నారాయణ వేములవాడ ఆర్డీసీ బస్ డిపో ఎడిసిగా పని చేస్తుండగా అల్వాల్ మచ్చబొల్లారంకు చెందిన రోహిత్ బాబూలాల్ కాలే అనే వ్యక్తి నారాయణను మోసం చేసి 50వేల రూపాయల దొంగతనంకు పాల్పడగా, నారాయణ అక్టోబర్ 28, 2023న ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి నిందితున్ని రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం విచారణ అధికారి అంజయ్య కోర్టులో ఛార్జీ షీటు దాఖలు చేయగా సిఎంఎస్ ఎస్ఐ రవీందర్ నాయకుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేష్ కోర్టులో సాక్షులను ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ తరుపున విక్రాంత్ కేసు వాధించగా, పూర్వ పరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి నిందితునికి 3 సంవత్సరాల కారాగార జైలు శిక్షతోపాటు 6వేల రూపాయల జరిమానా విధించారని సిఐ వివరించారు.

## ఈతకు వెళ్లి బాలుడి గల్లంతు

గొల్లపల్లి ప్రభాతవార్త :

సరదాగా స్నేహితులతో కలిసి గ్రామ పొలిమేరలో ఉన్న చెరువులోకి ఈతకు వెళ్లి బాలుడు గల్లంతయిన ఘటన గొల్లపల్లి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపల్లి మండలం లోని రంగధాముల పల్లె గ్రామానికి చెందిన నేరేళ్ళ పోచయ్య కుమారుడు నరేష్ (12) ఎనిమిదవ తరగతి చదువుతున్నాడు స్నేహితులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని చెరువులో ఈత కొట్టడానికి వెళ్లారు.ఈత కోసం చెరువులో దిగాడు ఈత రాకపోయేసరికి నీటిలో మునగి గల్లంతయ్యాడు. విషయాన్ని తండ్రి పోచయ్య పోలీసులకు తెలుపటంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు మధ్యాహ్నం నుండి రాత్రి వరకు వెతికిన బాలుడి ఆచూకీ లభించకపోవటంతో బుధవారం గజ ఈతగాళ్ళతో గాలించనున్నట్టు ఎస్సై చిర్ర సతీష్ తెలిపారు.

## విద్యుత్ మోటార్‌ను అపహరించిన గుర్తు తెలియని వ్యక్తులు

చందుర్తి, ప్రభాతవార్త :

చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఎర్రవెల్లి రాజు అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలో నుండి మోటర్,పైపులను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. గ్రామస్తుల కథనం ప్రకారం రోజు మాదిరిగానే ఉదయం పొలం వద్దకు వెళ్లేసరికి బావిలోని మోటర్, పైపులు కనిపించలేదు. మోటార్ విలువ దాదాపు రూ.40 వేల పైగా ఉంటుందని తెలిపారు.

## రేషన్ బియ్యం పట్టివేత

చందుర్తి మార్చి 25 ప్రభాతవార్త:



చందుర్తి మండలం రామారావు పల్లి గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యంను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్ఐ అంజయ్య తెలిపారు. పోలీసుల, గ్రామస్తుల కథనం ప్రకారం కొమురయ్య అనే వ్యక్తి లబ్ధిదారుల వద్ద నుండి కొనుగోలు చేసి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అతని వద్ద నుండి క్వింటల్ నర బియ్యాన్ని స్వాధీనం చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఆశాలను అరెస్టు చేయడం అన్యాయం

న్యాయమైన సమస్యలను తక్షణమే వరిష్కరించాలి

**కోరుట్ల, ప్రభాతవార్త** తమ న్యాయమైన డిమాండ్ల కోసం చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమంలో ఆశా వర్కర్లను అన్యాయంగా అరెస్టు చేయడం, వారిపై లాఠీ చార్జ్ చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని కోరుట్ల పట్టణ, మండల ఆశా వర్కర్లు అన్నారు. ఆశాలపై జరిగిన దాడికి నిరసనగా స్థానిక ఎమ్మార్వో కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూకాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు మరియు తర్వాత ఇచ్చిన హామీ మేరకు అశాలకు రు.18 వేల ఫిక్స్డ్ వేతనం నిర్ణయించి అమలు చేయాలన్నారు. ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తయినవారికి ప్రమోషన్ సౌకర్యం, ఇన్సూరెన్స్ సౌకర్యం, ఆదివారంతో పాటు, పండుగలకు సెలవులు ఇవ్వాలను, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పనిభారం తగ్గింపు, తదితర డిమాండ్ల పరిష్కారం కోసం ఈ రోజు ఛలో హైదరా బాదు కార్యక్రమానికి వచ్చిన అశా వర్కర్లపై పోలీసులు దాడి చేయడం, అమానుషంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా మన్నారు. వెంటనే ఆశా వర్కర్లతో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్క రించాలని, పోలీసులతో ఉద్యమాన్ని ఆపాలనుకుంటే ఈ ఉద్యమం ఉ ధృతంగా ముందుకొస్తుందని, ఆశా వర్కర్లకు ఆ చరిత్ర ఉన్నదని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్న మన్నారు. ఆశాలకు అంతకంతకూ



పని భారం పెరుగు తుందని, కానీ వేతనం కేవలం రు.9700లు మాత్రమే ఇస్తున్నారని, కనీస జీవనానికి కూడా ఇది సరిపోదన్నారు. . వేలాది మందిగా వచ్చిన ఆశాలతో మాట్లాడి సమస్యలు ముఖ్యమంత్రి అధికారులతో చర్చించి పరిష్కరించ కుండా, మహిళల బట్టలు చినిగిపోయేటట్లుగా లాగేసి,వ్యాన్లల్లో పడేసారని, రక్తం కారేటట్టుగా దెబ్బలు తగిలాయని, అరెస్టు చేసిన మహిళలందరినీ బేషరతుగా విడుదల చేయా లన్నారు.మహిళలను నడి రోడ్డుమీద ఈడ్చి, ఈ విధంగా అవమానించి నందుకు ప్రభుత్వం వారికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ, మండల ఆశా వర్కర్లు పాల్గొన్నారు

## జిర్డ్స్ స్వచ్ఛంద సంస్థ వారి ఆధ్వర్యంలో బియ్యం వితరణ



*భీమారం, ప్రభాతవార్త*

భీమారం మండలంలోని గోవిందారం గ్రామానికి చెందిన వడ్డెర పోషాలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. జిర్డ్స్ స్వచ్ఛంద సంస్థ అధినేత వెంకట్రావుపేట గ్రామ మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్ కుమార్వారి కుటుంబానికి ఆసరాగా ఉంటూ నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. భాదిత కుటుంబానికి అండగాఉంటానని ధైర్యం చెప్పారు. వారి ఇంటి సరిపడే నిత్యావసర సరుకులు బియ్యం వంట సామాగ్రి, దుస్తులు అందించారు. ఈ కార్యక్రమంలో జిర్డ్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ అంగడి ఆనందంత్జోపాటు మండల కాంగ్రెస్ నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నీరేటి మల్లేశం తోకల నరసయ్య కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి సయ్యద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ దాసరి గణేష్ చెక్కపెల్లి సంజీవ్, గోవిందరం గ్రామ కాంగ్రెస్ నాయకులు ప్యాట నారాయణ,వెంకటేష్,శేఖర్, మధు, నరహరి,రాజు, నాగరాజు పాల్గొన్నారు

# కొనుగోలు కేంద్రాలలో రైతులను ఇబ్బందులు పెట్టవద్దు

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మోలిక వసతులు కల్పించాలి

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

దాన్ని రవాణాకు అవసరమైన వాహనాలు సిద్ధం చేయాలి

సన్న ధాన్యం దొడ్డు వరి ధాన్యం రెండు కౌంటర్లు ఏర్పాటు చేయాలి

ధాన్యం మద్దతు ధర రైతులకు అందజేయాలి

కలెక్టర్ సత్య ప్రసాద్


**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:** నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ మద్దతు ధర పై వరి పంట కొనుగోలు సన్నద్ధం కావాలి..జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ పేర్కొన్నారు మంగళవారం రోజున కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో డి ఆర్ డి ఓ , రెవెన్యూ , ట్రాన్స్పోర్ట్ , అధికారులు మిల్లర్ల అసోసియేషన్, అదనపు కలెక్టర్ బి.ఎస్.లత తో కలసి యాసంగి ధాన్యం కొనుగోలు సన్నద్ధత పై రివ్యూ నిర్వహించారు.యాసంగి మార్కెటింగ్ సీజన్ లో నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలను తూచా తప్పకుండా పాటిస్తూ మద్దతు ధర పై వరి పంట కొనుగోలుకు సన్నద్ధం కావాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి మార్కెటింగ్ సీజన్ 202425 లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చివరి గింజ వరకు నాణ్యమైన వడ్లను మద్దతు ధరపై కొనుగోలు చేసి 48 గంటల్లో చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టర్ తెలిపారు. జగిత్యాల జిల్లాలో 5.50 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేసే అవకాశం ఉందని, దీనికి తగ్గట్టుగానే అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో అవసరమైన మేర కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు.జిల్లాలో మొత్తం 424 వరి ధాన్యం కొనుగోలు సెంటర్లో ఏర్పాటు చేయడం జరుగుతుందని అందులో ఐకెపి ద్వారా 132 కేంద్రాలు,పిఎసిఎసి ద్వారా 291 కేంద్రాలు మెప్మా ద్వారా 1 కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన టార్పాలిన్, తేమ యంత్రాలు, క్లీనింగ్ మిషన్లు వెయింగ్ యంత్రాలు గన్ని బ్యాగులు మొదలకు సామాగ్రి అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. మార్కెటింగ్ అధికారితో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సామాగ్రి కొనుగోలు కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులకు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సన్న వడ్లు, దొడ్డు వడ్లకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. పంట కోతలు జరిగేటప్పుడు హార్వెస్టర్లతో కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలు త్వరితగతిన తరలించాలని అన్నారు . రైస్ మిల్లులో ఎట్టి పరిస్థితుల్లోనూ తాలు కట్ చేయడానికి వీలు లేదని, నాణ్యతను కొనుగోలు కేంద్రాల దగ్గరే పరిశీలించి పంపాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద, రైస్ మిల్లుల వద్ద ఎక్కడ హమాలీల కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.వేసవికాలం నేపథ్యంలో ఐకెపి కొనుగోలు కేంద్రాల వద్ద త్రాగునీరు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు వంటి మోలిక వసతులు కల్పించాలని అధికారులకు ఆదేశించారు.ఈ సమావేశంలో ,అదనపు కలెక్టర్ బి.ఎస్ లత జిల్లా డీఎం మార్కెటింగ్ అధికారి, జితేందర్ జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జితేందర్ రెడ్డి సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగ సామాజిక సమైక్యతకు మార్గదర్శం

జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్

**జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:** రంజాన్ పర్వదినం సామాజిక సమైక్యతకు నిదర్శనమని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు.జగిత్యాల జిల్లాలో మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్, జగిత్యాల జిల్లా ఆధ్వర్యంలో ఘనంగా ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, అదనపు కలెక్టర్ బి.ఎస్. లత తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రంజాన్ పవిత్ర మాసం సమాజంలో ఒకరినొకరు గౌరవించుకునే స్ఫూర్తిని, సహనం, సహాయసహకారాలను పెంపొందించే గొప్ప సమయమని పేర్కొన్నారు. భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తుందని, ఇఫ్తార్ విందుల వంటి కార్యక్రమాలు సామాజిక సమైక్యతకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత, ఆర్డీవో శ్రీనివాస్ కలెక్టరేట్ పరిపాలన అధికారి హకీమ్ ట్రెస అధ్యక్షుడు ఎండి వకీల్, టి ఎన్ జి ఓ జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి వివిధ ప్రభుత్వ ఉద్యోగ సంఘాల నాయకులు మరియు ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# కోరుట్ల వార్త



## నవోదయ కు ఎంపికైన ధర్మారం విద్యార్థిని

*కోరుట్ల రూరల్, ప్రభాతవార్త*



మంగళవారం ప్రకటించిన జవహర్ నవోదయ ఫలితాలలో మండలంలోని ధర్మారం గ్రామంలో గల ఎంపీయు పిఎస్ లో చదువుతున్న విద్యార్థిని రాజోజి యశస్వి ఎంపికయింది. విద్యార్థిని యశస్వి నవోదయ సీటు సంపాదించడం సంతోషంగా ఉందని వచ్చే విద్యాసంవత్సరం ఇంకా ఎక్కువ సీట్లు వచ్చేవిధంగా కృషి చేస్తామని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫర్జానా బేగం తెలిపారు. నవోదయ సీటు సాధించిన యశస్విని గ్రామస్థులు , ఉపాధ్యాయులు అభినందించారు.

## వీర హనుమాన్ విజయ యాత్ర కరపత్రాల ఆవిష్కరణ

*కోరుట్ల, ప్రభాతవార్త*



భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించే వీర హనుమాన్ విజయ యాత్ర కరపత్రాన్ని స్థానిక శ్రీ వేంకటేశ్వర ఆలయంలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం కూడా భజరంగ్ దళ్ కోరుట్ల శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 8న ఈ వీర హనుమాన్ విజయయాత్ర నిర్వహించడం జరుగు తుందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో హిందూ బంధువు లంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, ఆర్ ఎస్ ఎస్, ఏబీవీపీ, బీజేపీ, బీజేవైఎం, జనసేన, స్థానిక హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన

*కోరుట్ల రూరల్, ప్రభాతవార్త*



మండలంలోని సర్వరాజ్పల్లి గ్రామం లో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో వోదెల రామకృష్ణ పరిశీలించారు. ఉపాధి హామీ పనులు అందరు వినియోగించుకోవాలని, పనిని నాణ్యంగా చేస్తూ కొలతలు ప్రకారం కూలి పడే విధంగా పనిచేయాలని కోరారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన వారి లబ్ధిదారుల ఇంట్లకు వెళ్లి ఇండ్ల నిర్మాణాన్ని పరిశీలించారు. త్వరగా ఇండ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని వివిధ దశల్లో లక్ష చొప్పున మొత్తం 5 లక్షలు లబ్ధిదారుని ఖాతాల్లో జమచేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి మాధవి,ఫీల్డ్ అసిస్టెంట్ లఖపతి, సిబ్బంది పాల్గొన్నారు.

# శుద్ధ జలం అందించే ఉద్దేశంతోనే ఫిల్టర్ బెడ్ మరమ్మత్తులు

- సీఎం రేవంత్ రెడ్డి చొరవతోనే 14 కోట్ల నిధులు
- రాయికల్ మంచినీటి పథకానికి 4.97 కోట్లు
- నెల రోజుల్లో ప్రజలకు శుద్ధ జలం అందించాలి
- కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

రాయికల్ ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జగిత్యాల నియోజకవర్గ ప్రజలకు శుద్ధ జలం అందించే ఉద్దేశంతోనే ఫిల్టర్ బెడ్ మరమ్మత్తులు 14 కోట్ల నిధులు మంజూరు చేశారని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. మంగళవారం రాయికల్ పట్టణంలోని ఫ్లోరైడ్ రహిత మంచినీటి పథకం మరమ్మత్తు పనులను ఇరిగేషన్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం రాయికల్ ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ గత ప్రభుత్వం తలపెట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నీరు సరఫరా చేస్తామని ప్రకటించినప్పటికీ నీరు అందలేదన్నారు. డబ్బా నుండి వచ్చే నీరు సుమారు 40 కిలోమీటర్లు ఉండగా 20 కిలోమీటర్లు పైగ నీటి సరఫరాతో క్లోరినేషన్ కోల్పోయి వచ్చిన నీరు శుద్ధ జలం ఎలా అవుతుందన్నారు. జగిత్యాల్ నియోజకవర్గ పరిధిలో రాయికల్, బీర్పూర్, జగిత్యాల్ మండలం పొలాస ఫ్లోరైడ్ రహిత మంచినీటి పథకం పునరుద్ధరణకు సి పి డబ్ల్యూ ఎస్ నిధుల నుండి రూ.14 కోట్ల నిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంజూరు చేశారని అందులో భాగంగానే రాయికల్ ఫిల్టర్ బెడ్ కు రూ.4.97 కోట్లు నిధులు మంజూరు తో మరమ్మత్తు పనులు జరుగుతున్నాయన్నారు. గతంలో అలం క్లోరినేషన్ నీటి సరఫరా అమల్లో ఉండేదని ప్రస్తుతం ఫిల్టర్ షాన్, ఫిల్టర్ గ్యాస్ క్లోరినేషన్ పద్ధతిలో శుద్ధ జలాన్ని నెల రోజుల్లో అందించేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. రాయికల్ పట్టణంలోని 9,10,11. వార్డుల్లో నీటి కొరత తీర్చేందుకు పైప్ లైన్, బూస్టర్ పంపు, టాంకర్స్, బోర్ వెల్ ద్వారా త్రాగునీటి సమస్యను పరిష్కరించాలన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని అమృత్ పథకం అమలకు రాయికల్ పట్టణంలో స్థల సేకరణ చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రాయికల్ పట్టణంలో 4 వాటర్ ట్యాంకులు ఉన్నాయని ఫిల్టర్ బెడ్ నుండి వాటర్ ట్యాంకులకు నీరు చేరేందుకు కొత్త పైప్ లైన్ కనెక్షన్ చేపట్టాలన్నారు. సమయం వృధా కాకుండా పాత పైప్ లైన్ ద్వారా రా వాటర్ పంపి మరమ్మత్తులు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, ఇరిగేషన్ డి ఈ జలంధర్ రెడ్డి, ఏఈలు ప్రసాద్, దీవక్, చంద్రకాంత్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు మ్యాకల రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపి రాజారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి గుర్రం మహేందర్ గౌడ్, హనుమాన్ ఆలయ చైర్మన్ దాసరి గంగాధర్, మాజీ సర్పంచ్ ఎద్దండి భూమ రెడ్డి, నాయకులు కొయ్యేడి మహిపాల్, బాపురపు నర్సయ్య, బత్తిని భూమ య్య, ఏద్దండి దివాకర్, తలారి రాజేష్, పొన్నం శ్రీకాంత్, షాకీర్, నరేష్, రమేష్, గంగారెడ్డి, రాకేష్ నాయక్, రాజేష్, గుమ్మడి సంతోష్, అశోక్ పాల్గొన్నారు.



# జగిత్యాల వార్త

## పూలే దంపతులకు భారత రత్న ఇవ్వాలి

టీ బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్ కుమార్

జగిత్యాల టౌన్ ప్రభాత వార్త:

సామాజిక సంస్కర్త జ్యోతిరావు పూలే, ఆయన సతీమణి సావిత్రీ భాయి పూలే లకు భారత రత్న ప్రకటించాలని టీ బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హరి అశోక్ కుమార్ కేంద్రప్రభుత్వంను డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన బీసీ జేఏసీ భవన్ లో విలేకరులతో మాట్లాడారు. మహాత్మా బిరుదు దేశంలో అన్నింటికన్నా చాలా గొప్పదన్నారు. దీనికి దేశ వ్యాప్తంగా ప్రజలు పూలే, గాంధీజీకి మాత్రమే ఇచ్చారన్నారు. పూలే దంపతులకు భారత రత్న ఇవ్వాలని మహారాష్ట్ర అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానం చేసిందని, అలాగే తెలంగాణ అసెంబ్లీలో సైతం ఏకగ్రీవంగా పూలే దంపతులకు భారత రత్న ఇవ్వాలని తీర్మానం చేయాలని కోరారు.. ఈ మేరకు బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి బండారి విజయ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగం భాస్కర్, జిల్లా అధ్యక్షుడు కొండ లక్ష్మణ్, కార్యదర్శి ములస్తం శివప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు వెల్ముల ప్రకాశ్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి మారిశెట్టి అశోక్,, మహిళా జేఏసీ జిల్లా అధ్యక్షురాలు కస్తూరి శ్రీమంజరి, జగిత్యాల పట్టణ అధ్యక్షురాలు సింగం పద్మ, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల సత్యనారాయణ, జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షుడు పుప్పాల నర్సింగ రావు, తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరిపించాలి

### సంతాపం వ్యక్తం చేస్తూ క్రొవ్వత్తుల ర్యాలీ

జగిత్యాల టౌన్ ప్రభాత వార్త:



పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి చెందడం బాధాకరమని జగిత్యాల అర్బన్ రూరల్ పాస్టర్స్, సువార్తికుల అసోసియేషన్ తెలిపింది. ప్రవీణ్ మృతి పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, మంగళవారం జిల్లా కేంద్రంలోని తహసిల్ చౌరస్తాలో క్రొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు.. ఈ సందర్భంగా అసోసియేషన్ బాధ్యులు మాట్లా డుతూ ప్రవీణ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.. సత్య అన్వేషణలో భాగంగా విమర్శలకు మంచి వాతావరణంలో చర్చ వేదికల ద్వారా చక్కగా విశ్లేషణాత్మకంగా వారి గ్రంథాలలో నుండి జవాబులు చెప్తూ ఉండే వారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. రక్షణ టీవీ ఛానల్ ద్వారా ప్రవీణ్ చేసిన సువార్త సేవ చాలా అమూల్యమైనదన్నారు. రాజమండ్రిలోని దివాన్ చెరువు వద్ద బైక్ యాక్సిడెంట్ జరిగి ప్రవీణ్ చనిపోయాడని వార్తలు వస్తున్నాయి..కానీ చనిపోయిన అతని శరీరముపై ఉన్న గాయాలను చూస్తే హత్య చేసి ఉంటారనే అనుమానం కలుగుతుందన్నారు. ఎందుకంటే కొంతమంది గతంలో ప్రవీణ్ ను చంపుతానని బెదిరింపు కాల్స్ కూడా చేశారన్నారు.. ఈ విషయంపై పూర్తి విచారణ పోలీసులు నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని కోరారు.. అవసరమైతే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించి న్యాయం చేయాలన్నారు.. అదేవిధంగా రోజు రోజుకు క్రైస్తవులపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అడ్డుకోవాలని, ప్రత్యేక చట్టం తీసుకొని రావులని వారు విజ్ఞప్తి చేశారు.. ఈ ర్యాలీలో అసోసియేషన్ నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు...

## గురుకుల పాఠశాల పోటీ పరీక్షల్లో కోల్వాయి శ్రీరామ హై స్కూల్ సంచలనం

నవోదయ గురుకుల పరీక్షలలో 10 సీట్లతో సత్తా చాటిన విద్యార్థులు

బీర్పూర్ ప్రభాతవార్త:

జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోని కొల్వాయ్ గ్రామంలోని శ్రీ రామ హై స్కూల్ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులు గురుకుల పోటీ పరీక్షల ఫలితాలలో సంచలనం సృష్టించారు. నవోదయ గురుకుల పాఠశాల పరీక్షలలో 10 మంది విద్యార్థిని విద్యార్థులు పి. జస్వంత్, ఎం. ఆరాధ్య, బి. మహిష్మ, ఎస్. సహస్ర, బి.రిషివర్ధన్, వి. క్రాంతి కుమార్, కె, అనయ్ కృష్ణ, వి. వేణు, ఎన్. విగ్నేష్, బి. నిత్యశ్రీ, ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల కరస్పాండెంట్ కొలుముల రమణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మరియు మేనేజ్మెంట్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలకు చెందిన విద్యార్థులు తమ పాఠశాలలో చదివి గురుకుల నవోదయాల్లో ఉత్తీర్ణత సాధించి సీట్లు సాధించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. తల్లిదండ్రుల మద్దతుతోనే ఈ ఘనత సాధించామని తెలియజేశారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ మేనేజ్మెంట్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శాసనమండలి చైర్మన్‌ని కలిసిన మాజీ మంత్రి

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారి చాంబర్లో మాజీ మంత్రివర్యులు , తెలంగాణ మొదటి ఆర్థిక సంఘం చైర్మన్ జి రాజేశం గౌడ్ కలవడం జరిగింది. అనంతరం మాజీ మంత్రివర్యులు మరియు తెలంగాణ మొదటి ఆర్థిక సంఘం చైర్మన్ జి రాజేశం గౌడ్ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మాజీ శాసనసభ్యులు , మాజీ శాసనమండలి సభ్యుల సంగం తరపున రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ కోరడం జరిగింది. ఇటీవల శాసనసభ లో మాజీ శాసనసభ్యుల , శాసనమండలి సభ్యుల సంఘం కి సంబంధించిన బృందం ముఖ్యమంత్రి ని కలవడం జరిగింది ఆరోజు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి మరొకసారి మాజీ శాసనసభ్యులు మరియు మాజీ శాసనమండలి సభ్యుల కు సంబంధించి ఎదుర్కొంటున్న ఇబ్బందులు పై చర్చిద్దాం అని హామీ ఇవ్వడం జరిగింది. ఈ విషయాన్ని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి కి మాజీ మంత్రివర్యులు , తెలంగాణ మొదటి ఆర్థిక సంఘం చైర్మన్ జి రాజేశం గౌడ్ గుర్తు చేసి సిఎం రేవంత్ రెడ్డి అపాయింట్మెంట్ తీసుకోమని తెలపడం జరిగింది.

## జిల్లా పశువైద్యాధికారి పదవి విరమణ సన్మాన కార్యక్రమం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల జిల్లా పశువైద్యాధికారి పదవి విరమణ ముందస్తు కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. జగిత్యాల జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారి ఎస్ ఎల్ మనోహర్ ఈనెల మార్చ్ 31న పదవి విరమణ పొందుతున్న సందర్భంగా స్థానిక వి ఆర్ బి ఫంక్షనల్ యందు మంగళవారం తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నరీ య న్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా తరఫున ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ సంచాలకులు మహిళా శిశు సంక్షేమ అధికారి డాక్టర్ బి బోనగిరి నరేష్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి పూర్ణచందర్ సెక్రెటరీ నాగేందర్ రెడ్డి కోశాధికారి గణేష్ ఉపాధ్యక్షులు గరిగంటి రవి సెంట్రల్ అసోసియేషన్ సభ్యులు ఎలిగేటి రవీందర్ రాజకుమార్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర బిఆర్ఎస్ నాయకుని కుమార్తె అమెరికాలో మృతి

వీణవంక, ప్రభాత వార్త:

వీణవంక మండలం పోతిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర బిఆర్ఎస్ నాయకుడు పరిపాటి రవీందర్ కుమార్తె హరిత అమెరికా లో ఉద్యోగం చేస్తు స్థిరపడి గత కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురై చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు సన్నిహిత వర్గాలు మంగళవారం తెలిపారు.

## ఎస్సీలకు చట్ట బద్దత కల్పించడం అభినందనీయం

సారంగాపూర్ ప్రభాత వార్త:



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత 30 సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నటువంటి ఎస్సీ రిజర్వేషన్లను అసెంబ్లీలో ప్రకటించడం వాటికి చట్టం చట్టబద్ధత కల్పించడం అభినందనీయమని తెలంగాణ అంబే ద్కర్ సంఘం అధ్యక్షులు పూడూరి శోభన్ ప్రధాన కార్యదర్శి సాతరాజు లక్ష్మీ మ్రరాజ్యం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీట్ల పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల కల నెరవేయడం వల్ల దళితుల భవిష్యత్తు బాగుపడుతుందని దీంతో ప్రభుత్వానికి ఎప్పటికీ మేము రుణపడి ఉంటామని అన్నారు ఈ కార్యక్రమంలో తిరుపెల్లి రాజయ్య, నవదీప్ బదనపల్లి శంకర్, నలువాల బుజ్జయ్య. ప్రవీణ్, నితిన్, శాతరాజు ధర్మయ్య, రాజయ్య ఆదిత్య నవదీప్ మల్లేష్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు

# లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

### మెటుపల్లి లో స్కానింగ్ కేంద్రాల తనిఖీ

### జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ జైపాల్ రెడ్డి

మెట్ పల్లి, ప్రభాతవార్త:



గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం 1994 ప్రకారం లింగ నిర్ధారణ చేసి ఆడ,మగ అని చెప్పడం చట్టరీత్యా నేరమని జిల్లా మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి అన్నారు.మెట్ పల్లి పట్టణంలో కొత్తగా రిజి స్ట్రేషన్ చేసుకున్న,పాత స్కా నింగ్ సెంటర్ లు రెన్యువల్ కొరకు దరఖాస్తు చేసుకున్న వాటిని, ఆసుపత్రులను ఆర్డీవో ఎన్. శ్రీనివాస్ తో కలిసి మంగళవారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా వారు స్కానింగ్ సెంటర్లలో పేషంట్ల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన కనీస వసతులు , వెంటిలేషన్ సౌకర్యం ,వెయిటింగ్ హాల్ , నిబంధనల ప్రకారం ఉన్నాయా అని పరిశీలించారు.స్కానింగ్ మిషన్స్, డాక్టర్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉన్నాయా అని,నిబంధనలకు లోబడి అన్ని సక్రమంగా ఉన్నట్లయితే ఆయా కేంద్రాల దరఖాస్తులను అనుమతి కొరకు సిఫారస్ చేస్తామని ఆర్డిఓ శ్రీనివాస్ తెలిపారు.అలాగే ఫారం ఎఫ్ లు ప్రతినెల 5వ తారీఖు లోపు వారికి కేటాయించబడిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సబ్మిట్ చేయవలసిందిగా ఆదేశించారు. ఫారం ఎఫ్ లు ఆన్లైన్లో, ఆఫ్ లైన్ లో ఒకే విధంగా ఉండాలన్నారు. లింగ నిర్ధారణ చేసేటప్పుడు పేషంట్లకు కనపడే విధంగా ఇక్కడ లింగ నిర్ధారణ చేయబడదు లింగ నిర్ధారణ చేసినచో కఠిన చర్యలు తీసుకోబడతాయి అను ఫ్లెక్సీ బోర్డులు ,ఫోం బోర్డులు తప్పకుండా ఏర్పాటు చేయాలని జైపాల్ రెడ్డి తెలిపారు.ఈ నిబంధనలు అతిక్రమించి లింగ నిర్ధారణ చేసినచో జరిమానా విధించబడడమే కాకుండా, గర్భిణీ మినహా ప్రోత్సహించిన వారిపై కూడా జరిమానా, మూడు నెలల జైలు శిక్ష కూడా ఉంటుందని, వైద్యుల యొక్క రిజిస్ట్రేషన్ కూడా రద్దుపరిచబడతాయని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై నోటీసులు జారీ చేయబడునని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం, హెల్త్ సూపర్వైజర్ శ్యామ్,తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో లయన్స్ క్లబ్ సేవలను విస్తృతంగా అందిస్తాం

### లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట రాజారాం

మెట్ పల్లి(మల్లాపూర్),ప్రభాతవార్త:



రానున్న రోజుల్లో మల్లాపూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గ్రామాల్లో మరిన్ని స్వచ్ఛంద కార్యక్రమాలు చేపట్టి సేవలను విస్తృతంగా అందజేస్తామని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోట రాజారాం అన్నారు.మండలంలోని సిరిపూర్ గ్రామంలో మంగళవారం ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ..మల్లాపూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత ఎనిమిది సంవత్సరాలుగా మండల వ్యాప్తంగా 2000కు పైగా ఉచిత కంటి ఆపరేషన్లు చేయించామని గుర్తు చేశారు. గ్రామాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు, లయన్స్ క్లబ్ సభ్యులు,ప్రజల సమిష్టి సహకారంతో మరిన్ని సేవలను అందజేస్తామని పేర్కొన్నారు. అనంతరం ఈ వార్షిక సంవత్సరం ఉత్తమ సేవలందించిన లయన్స్ క్లబ్ పిఎస్టి లను సభ్యులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి సుతారి రాజేందర్, కోశాధికారి మార్గం రాజేశ్వర్, మాజీ అధ్యక్షులు దేవ మల్లయ్య, రుద్ర రాంప్రసాద్, ఏనుగు రాంరెడ్డి, కనుక సంజీవ్, సభ్యులు తోట శ్రీనివాస్, క్యాతం సురేష్ రెడ్డి, మిట్టపల్లి మహేష్ రెడ్డి, కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, దారిశెట్టి చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి సీతక్కని కలిసిన కోట దుర్గరాజు

మెట్‌పల్లి అర్బన్ ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్ర శాసనసభలో పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యు ఎస్,మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రివర్యులు సీతక్కను కోట దుర్గ రాజ్ మంగళవారం శాసనసభలోని వారి కార్యాలయం లో కలిసి కోరుట్ల నియోజకవర్గంలోని పలు అంశాలపై చర్చించిన అనంతరం ప్రతి సమస్యను పరిష్కరించే విధంగా తెలంగాణ ప్రభుత్వం ముందుం టుందని ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కారం చేసేలా కృషి చేస్తామని తెలిపారు సమస్యలపై సానుకూలంగా స్పందించిన మంత్రి సీతక్క కు దుర్గరాజు ధన్యవాదాలు తెలిపారు

# సిఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన ఎమ్మెల్సీ ఎల్ రమణ

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



జగిత్యాల నియోజకవర్గం లోని వివిధ కారణాలతోని ఆసుపత్రిలో చికిత్స పొంది వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి కొరకు ఎమ్మెల్సీ కి అర్జీ చేసుకోగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్ రమణ సీఎం సహాయనిది నుండి మంజూరైన చెక్కులను మంగళవారం జగిత్యాల ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ చైర్మన్ దావ వసంత సురేష్, పట్టణ మరియు మండల అధ్యక్ష కార్యదర్శులు తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# మేము ఏమి పాపం చేశాము?

### మా వీధిలో సిమెంట్ రోడ్డు ఎందుకు వేయరు ?

చిగురుమామిడి, ప్రభాత వార్త :

చిగురుమామిడి మండల కేంద్రం లోని 5వ వీధిలో ఉన్న మేము ఏమి పాపం చేశాము, మా వీధిలో ఎందుకు సిమెంట్ రోడ్డు వేయడం లేదని మంగళవారం రోజున ప్రభాత వార్తతో వీధి వాసులు ఆరోపిస్తున్నారు. గ్రామం లో సీసీ రోడ్డు అంతగా అవసరం లేని స్థలాల్లో యథేచ్ఛగా పోస్తున్నారని, మా వీధిని ఎందుకు పగ బట్టారో అర్థం కావడం లేదని, ఎన్ని మార్లు మొర పెట్టుకున్నా స్పందన లేదని అంటున్నారు. సీసీ రోడ్డు వ్యక్తిగత స్వార్థ ప్రయోజనాల కోసం, భవిష్యత్తు ఎన్నికల్లో తమకు ఓట్లు ఎక్కువగా వేస్తారో లేదో అని చూస్తున్నారని అంటున్నారు. కచ్చితంగా సీసీ వేయాలని ధ్రువీకరించే అధికారులు లేకపోవడం దౌర్భాగ్యమని 5వ వీధి వాసులు ఆవేదన చెందుతున్నారు. ప్రజల సంక్షేమం దృష్ట్యా ప్రజావసరాల నిమిత్తం వేయాల్సిన సీసీ రోడ్లు ప్రభుత్వ వెటర్నరీ హాస్పిటల్ ఆవరణంలో సీసీ పోయటం ఎంత వరకు సమంజసమని? ప్రశ్నిస్తున్నారు? ఇక ఎన్నో వీధుల్లో అవసరం మేరకు పోయాల్సిన సీసీ రోడ్లు చిగురుమామిడి గ్రామ పంచాయతీ ఆవరణం లో సీసీ పోసి చేతులు దులుపుకున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే గత ప్రభుత్వం కూడా తమ 5వ వీధిని పగ పట్టిందని, ఇప్పుడు ఈ ప్రభుత్వం కూడా అదే పద్ధతిని అవలంబించడం దౌర్భాగ్యం అని నిట్టూరుస్తున్నారు.



# మెట్‌పల్లి వార్త

## మండల నాయి బ్రాహ్మణ నూతన కార్యవర్గం ఎన్నిక

ఇబ్రహీంపట్నం, ప్రభాతవార్త :



మండల కేంద్రంలో నాయి బ్రాహ్మణ సేవా సంఘ భవనంలో మంగళవారం ఇబ్రహీంపట్నం మండల నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నాయి బ్రాహ్మణ సేవా సంఘం మండల అధ్యక్షుడిగా వర్షకొండ గ్రామానికి చెందిన సమ్మెట రాజేష్, ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన పసునూరి ఆంజనేయులు ప్రధాన కార్యదర్శిగా, గోదూరు గ్రామానికి చెందిన రాచకొండ రవి ఉపాధ్యక్షుడిగా, కోమటి కొండాపూర్ గ్రామానికి చెందిన వెల్లుల్ల రమేష్ కోశాధికారిగా, అమ్మక పేట గ్రామానికి చెందిన చింతకుంట రాజ గంగారాము గౌరవ అధ్యక్షుడిగా మండల నాయి బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మూడు సంవత్సరాల వరకు పదవిలో కొనసాగుతారని సభ్యులు తెలిపారు. కార్యవర్గ సభ్యులుగా సమ్మెట హన్మండ్లు, ఆషాడపు శోభన్, సమ్మెట శ్రీనివాస్, మిరుదొడ్డి రవి, చింతకుంట భూమన్న లను ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామాల నాయి బ్రాహ్మణ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## శిథిలావస్థకు చేరిన షాపులను ఖాళీ చేయాలి

మెట్‌పల్లి అర్బన్ ప్రభాతవార్త:



దేవాదాయ ధర్మదాయ శాఖ కార్య నిర్వహణ అధికారి ముద్దం విక్రమ్ మంగళవారం విలేకరులకు పత్రికా ప్రకటన ద్వారా వారు మాట్లాడుతూ పట్టణంలోని ఏడ్మాల లక్ష్మారెడ్డి చార్జిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 23139 నుండి 23144 వరకు 6 షాపులు 31జనవర 2025 వరకు లీజు ముగియడంతో తక్షణమే ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు ప్రస్తుతము తిరిగి లీజు కొనసాగించుటకు వీలు లేనందున సదురు బిల్డింగ్ శిథిలావస్థకు చేరినందున సదురు బిల్డింగు ఏ సమయంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉన్నందున మరియు పట్టణ మున్సిపాలిటీ అధికారులు కూలిపోయే ప్రమాదం ఉన్నట్లు హెచ్చరికలు జారీ చేసి ఉన్నారు కావున వెంటనే ప్రస్తుతం లీగదారులు షాపులను ఖాళీ చేసి వెళ్లాలని ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు తెలియజేయడమైనది లేనిచో చట్టపరమైన చర్యలతో పాటు వారిచే కాలి చేయడం జరుగుతుందని తెలియజేశారు

## ఆకాంక్షలు నెరవేర్చకుంటే నిరసన తప్పదు

కరీంనగర్ టౌన్,ప్రభాత వార్త:

ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల సాధనకు తక్షణం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేర్చే ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల పట్ల ఉదాసీనత పనికిరాదని టీటీజేఏసీ చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మంగళవారం కరీంనగర్ టీఎన్జీఓస్ భవన్లో జరిగిన టీజిఇజేఏసీ జిల్లా కమిటీ ఏర్పాటు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఐక్య ఉద్యమం ద్వారా ప్రభుత్వం పై ఒత్తిడికి తక్షణ కార్యచరణ ప్రారంభించాలని హక్కుల సాధనకై ఉద్యమించాల్సిన పరిస్థితులు తలెత్తాయన్నారు.ఆర్థికపరమైన అంశాలపై రాష్ట్ర జేఏసీ ఇప్పటికే ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించిందని తక్షణం విధానపరమైన నిర్ణయం తీసుకొని ఉద్యోగ ఉపాధ్యాయ పెంచిన ఆకాంక్షలను నెరవేర్చాలని పేర్కొన్నారు. టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహస్వామి, కిరణ్, కుమార్ ,రాజేష్ ,భరద్వాజ్ హర్మిందర్,సుమంత్ రావు, తదితరులు పాల్గొన్నారు

# సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

*తంగళ్ళపల్లి,ప్రభాతవార్త.*



తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి,లక్ష్మీ ౖపూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక కాంగ్రెస్ నేతల చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ తో ఎంతో లబ్ధి చేకూరుతుందన్నారు.ఈ చెక్కులను మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి,మండల అధ్యక్షుడు ప్రవీణ్ జె టోనీ లకు లబ్ధిదారుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ ఉపాద్యక్షులు గుగ్గిళ్ల శ్రీకాంత్ గౌడ్,వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆరెపల్లి బాలు,సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్ఛార్జ్ గుగ్గిల్లా అభినయ్ గౌడ్,కోదాధి మల్లేష్ బాబు,గుగ్గిళ్ల యెల్లయ్య, కోదాది బాపు సార్,కోధాధి అంజయ్య,గ్రామ శాఖ అధ్యక్షుడు గౌరవెని చందు, గడ్డం అజయ్ కుమార్, మెరుపుల ప్రశాంత్, నందగిరి ఆంజనేయులు,తాల్లపల్లి రమేష్,వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు..

# లింగన్నపేటలో చలివేంద్రము ప్రారంభం



*గంభీరావుపేట, ప్రభాతవార్త:*

గంభీరావుపేట మండలం లింగన్నపేట బస్టాండ్ ఆవరణలో హరిహర ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఎస్సై శ్రీకాంత్ ప్రారంభించారు. సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గత 18 సంవత్సరాలుగా వేసవికాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చడానికి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. మునుముందు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వేద పండితులు రాధాకృష్ణ శర్మ, నాయకులు లింగన్నగారి దయాకర్ రావు , దుబాసిరాజు బాలమల్లు, చింతల కిష్టయ్య, పాపారావు, అంజయ్య, ఆటో యూనియన్ అధ్యక్షుడు సత్యనారాయణ, వైస్ చైర్మన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బాపూరావు, సభ్యులు శ్రీనివాస్ , స్వామి , తిరుపతి , రవి, మోతీరం, రాజు దేవేందర్ , రమేష్ శంకర్. కైలాస్ గంజి స్వామి, పాపారావు , దేవదాస్, రాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో నేత కార్మికుడు ఆత్మహత్య

*తంగళ్ళపల్లి,ప్రభాతవార్త.*

.తంగళ్ళపల్లి మండలం ఇందిరమ్మ కాలనీకి చెందిన పర్కిపెల్లి రాజు (55) అనే నేత కార్మికుడు యాసిడ్ తాగి ఆత్మహత్య యత్నం చేయగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గత ఐదు నెలలుగా సరైన ఉపాధి లేక,అప్పుల బాధతో రాజు మనస్థాపానికి గురై బాత్రూమ్ లో యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని వెల్లడించారు.ఈ క్రమంలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు.మృతుడికి భార్య పద్మ ,ఒక కొడుకు,ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.మృతుడు రాజు కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

## పాఠశాలల సందర్శన విద్యార్థులకు కొత్త అనుభవలను నేర్పుతుంది

*వీర్నపల్లి ప్రభాత వార్త*

మండల కేంద్రంలోని పి ఎం శ్రీ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, వీర్నపల్లి లో చదువుతున్న 3, 4, 5 వ తరగతి విద్యార్థులు ట్వీన్నింగ్ అఫ్ స్కూల్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజు కోనరావుపేట



మండలంలోని మరిమడ్ల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ను సందర్శించడం జరిగింది ఈ సందర్శన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తమ పాఠశాల సంస్కృతి విద్యా వ్యవస్థలను పరిచయం చేశారు. అలాగే ఆ పాఠశాలలో ఉన్న కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ తరగతులు, రిటైల్ ల్యాబ్, ప్రయోగశాల, గ్రంథాలయం మ్యూజిక్ రూమ్,ఓమ్, ఆటమైదానం మొదలగు వాటిని సందర్శించి పరిశీలించారు.ఈ సందర్శన రెండు పాఠశాలల మధ్య మిత్రుత్వాన్ని పెంపొందించడమే కాకుండా విద్యార్థులు ఎన్నో నూతన విషయాలను నేర్చుకోవడానికి సృజనాత్మకతను. పెంపొందించుకోవడానికి దోహదపడింది. ఈ పర్యటన ఉపాధ్యాయులకు విద్యార్థులకు చాలా గొప్ప అనుభవాన్ని సామాజిక నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశం కల్పించిందాని సందర్శనలో పాల్గొన్న ఉపాధ్యాయ బృందం అన్నారు కార్యక్రమంలో మరిమడ్ల ప్రిన్సిపల్ రామ్ సూరత్ యాదవ్,పి ఎం శ్రీఎంపీపిఎస్ వీర్నపల్లి ప్రధానోపాధ్యాయురాలు ఎం ఉదయలక్షి ౖ ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలిజీ

*సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త.*



ప్ర్తభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జీఎం ఇండస్ట్రీస్ హనుమంతు పేర్కొన్నారు.!!జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు పీ ఎం ఈ జీ పీ పీఎంఎఫ్ఎం ఈడీఈఈటీ పీఎం ఐఎస్, విశ్వకర్మ యోజన అంశాలపై యువత, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్, ఐటీఐ, డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులకు మంగళవారం అవగాహన సదస్సు జిల్లా సమీకృత సముదాయ కార్యాలయాలో నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం ఇండస్ట్రీస్ హనుమంతు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్వయం ఉపాధి పథకాలను వినియోగించుకొని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షి ంచారు. యువతకు శిక్షణ అందిస్తూ ఉపాధి అవకాశాలు కల్పించే పథకాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని వివరించారు. మార్కెట్ లో వస్తున్న నూతన టెక్నాలజీ, యంత్రాలు అప్డేట్ పై ఎప్పటి కప్పుడు సమాచారం ఉండాలని పేర్కొన్నారు. మార్కెట్ కు అనుగుణంగా విభిన్నమైన యూనిట్లు స్థాపించి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షి ంచారు. డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ అప్లికేషన్ పై జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్ యువతీ యువకులకు వివరించారు.డీ.ఈ.ఈ.టీను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని, ఇందులో నమోదైతే విద్యార్థులకు ఉన్న నైపుణ్యాల అర్హత ప్రకారం ప్రైవేట్ రంగంలో ఉన్న ఉద్యోగ అవకాశాల వివరాలు తెలుస్తాయని, నిరుద్యోగులకు పరిశ్రమలకు వారధిగా ఇది పనిచేస్తుందని అన్నారు.ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, ఫార్మసీ, ఇతర ఉపాధి కోర్సులు చదివిన విద్యార్థులు డీ.ఈ.ఈ.టి లో రిజిస్టర్ చేసుకోవడం ద్వారా ప్రభుత్వ ప్రైవేటు రంగంలో ఉపాధి పొందే అవకాశాలు మెరుగు అవుతాయని జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్ అన్నారు.అవగాహన సదస్సులో డీ.ఆర్డీఓ శేషాద్రి, ఏడీ ఇండస్ట్రీస్ భారతి, జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ ౖరాజం, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల వార్త

# ధాన్యం కొనుగోలుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్



*సిరిసిల్ల టౌన్ ప్రభాతవార్త*

యాసంగి సీజన్ నందు జిల్లాలో రైతులు పండించిన ధాన్యం మద్దతు ధర పై కొనుగోలు చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ప్రతి మండల పరిధిలో తహసిల్దార్ ఆధ్వర్యంలో హార్వెస్టర్లతో సమావేశం నిర్వహించి పంట కోతల సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనల పై సలహాలు అందించాలని, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల టోకెన్ విధానంలో ప్రణాళిక ప్రకారం పంట కోతలు జరిగేలా చూడాలని అన్నారు.రైతులంతా ఒకేసారి ధాన్యం తీసుకుని వచ్చి ఇబ్బంది పడకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ధాన్యము కొనుగోలు కేంద్రాలకు రైతులు ఎప్పుడు దాన్యం తీసుకుని రావాలో షెడ్యూల్ రూపొందించి రైతులకు సమాచారం అందించాలని అన్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ధాన్యం క్లీన్ చేయడం, ఆర బెట్టడం వంటి అంశాలను రైతులకు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మోలిక వసతుల కల్పించాలని , ప్యాడీ క్లీనర్, వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు , మొదలగు వసతులు కల్పించాలని అన్నారు.ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో త్రాగు నీరు, విద్యుత్ సరఫరా, లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు . వేసవి దృష్ట్యా త్రాగునీటి సరఫరా ప్రత్యేక దృష్టి సారించాలని, చల్లని త్రాగు నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు పెట్టుకోవాలని అన్నారు. కొనుగోలు సమయంలో రైతులకు వడదెబ్బ తగిలే అవకాశాలను నివారించాలని అన్నారు. వడదెబ్బ తగిలితే వారికి ప్రాథమిక చికిత్స అందించే ఏర్పాటు చేయాలని అన్నారు. వేయింగ్ యంత్రాలను తేమ యంత్రాల పని తీరు చెక్ చేసి సర్టిఫై చేయాలని అన్నారు.ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. దాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జి , సిబ్బందికి అవసరమైన శిక్షణ అందజేయాలని కలెక్టర్ సూచించారు.వ్యవసాయ శాఖ విస్తరణ అధికారులు గ్రామాల వారీగా సన్న రకం ధాన్యం ధ్రువీకరణ చేసి కొనుగోలు కేంద్రం మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్ని సంచులు, అకాల వర్షాల నుంచి పంట కాపాడేందుకు వీలుగా టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన హామాలీ లు ఉండేలా చూడాలని అన్నారు.ధాన్యం తరలింపుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం తరలింపుకు ఎక్కడైనా ట్రాక్టర్లను వినియోగిస్తే కేసులను నమోదు చేయడం జరుగుతుందని, లారీలలో మాత్రమే ధాన్యం తరలింపు జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు పై ఫిర్యాదుల నమోదుకు జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ఒక నెంబర్ కేటాయించాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ రజిత, జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్షి ౖ, జిల్లా రవాణా అధికారి లక్ష ౖణ్, డి.ఎం. మార్కెటింగ్ ప్రకాష్, డి.సి. ఓ. రామకృష్ణ, వ్యవసాయ అధికారి రామారావు, తూనికలు కొలతల అధికారి రూపేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్**

సిరిసిల్ల టౌన్ ప్రభాత వార్త:



యాసంగి సీజన్ నందు జిల్లాలో రైతులు పండించిన ధాన్యం మద్దతు ధర పై కొనుగోలు చేసేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయ సముదాయంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ధాన్యం కొనుగోలు పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ ప్రతి మండల పరిధిలో తహసిల్దార్ ఆధ్వర్యంలో హార్వెస్టర్లతో సమావేశం నిర్వహించి పంట కోతల సమయంలో పాటించాల్సిన నియమ నిబంధనల పై సలహాలు అందించాలని, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారుల టోకెన్ విధానంలో ప్రణాళిక ప్రకారం పంట కోతలు జరిగేలా చూడాలని అన్నారు. రైతులంతా ఒకేసారి ధాన్యం తీసుకుని వచ్చి ఇబ్బంది పడకుండా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ధాన్యము కొనుగోలు కేంద్రాలకు రైతులు ఎప్పుడు ధాన్యం తీసుకుని రావాలో షెడ్యూల్ రూపొందించి రైతులకు సమాచారం అందించాలని అన్నారు. ధాన్యం నాణ్యత ప్రమాణాలపై రైతులకు విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ధాన్యం క్లీన్ చేయడం, ఆర బెట్టడం వంటి అంశాలను రైతులకు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పించాలని , ప్యాడీ క్లీనర్, వేయింగ్ యంత్రాలు, తేమ యంత్రాలు , మొదలగు వసతులు కల్పించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో త్రాగు నీరు, విద్యుత్ సరఫరా, లైట్లు మొదలగు సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు . వేసవి దృష్ట్యా త్రాగునీటి సం~ఫరా ప్రత్యేక దృష్టి సారించాలని, చల్లని త్రాగు నీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. అవసరమైన మేర ఓఆర్ఎస్ ప్యాకెట్లు పెట్టుకోవాలని అన్నారు. కొనుగోలు సమయంలో రైతులకు వడదెబ్బ తగిలే అవకాశాలను నివారించాలని అన్నారు. వడదెబ్బ తగిలితే వారికి ప్రాథమిక చికిత్స అందించే ఏర్పాటు చేయాలని అన్నారు. వేయింగ్ యంత్రాలను తేమ యంత్రాల పని తీరు చెక్ చేసి సర్టిపై చేయాలని అన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ చేసేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ తెలిపారు. దాన్యం కొనుగోలు కేంద్రాల ఇంచార్జి , సిబ్బందికి అవసరమైన శిక్షణ అందజేయాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయ శాఖ విస్తరణ అధి. కారులు గ్రామాల వారీగా సన్న రకం ధాన్యం ధ్రువీకరణ చేసి కొనుగోలు కేంద్రం మ్యాపింగ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్ని సంచులు, అకాల వర్షాల నుంచి పంట కాపాడేందుకు వీలుగా టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన హామాలీ లు ఉండేలా చూడాలని అన్నారు. ధాన్యం తరలింపుకు అవసరమైన వాహనాలను సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ధాన్యం తరలింపుకు ఎక్కడైనా ట్రాక్టర్లను వినియోగిస్తే కేసులను నమోదు చేయడం జరుగుతుందని, లారీలలో మాత్రమే ధాన్యం తరలింపు జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు పై ఫిర్యాదుల నమోదుకు జిల్లాలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ఒక నెంబర్ కేటాయించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేషాద్రి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ రజిత, జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మి ్మ, జిల్లా రవాణా అధికారి లక్ష ్మణ్, డి.ఎం. మార్కెటింగ్ ప్రకాష్, డి.సి. ఓ. రామకృష్ణ, వ్యవసాయ అధికారి రామారావు, తూనికలు కొలతల అధికారి రూపేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టంను సరైన పద్దతిలో అవలంభించాలి

**- నెలవారీ నేర సమీక్ష సమావేశంలో భాగంగా**



**కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్**

జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:

పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టం ను సరైన పద్దతిలో అవలంభిం చాలని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ పేర్కొన్నారు. నెలవారీ నేర సమీక్ష సమావేశంలో భాగంగా హుజురాబాద్ సబ్ డివిజన్ ఏసిపి కార్యాలయం నందు మంగళవారం కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం డివిజన్ స్థాయి నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు కమీషనర్ మాట్లాడుతూ... స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్లు వారి వారి పరిధిలోని పోలీసు స్టేషన్లను తరుచూ సందర్శిస్తూ వారి పని తీరును పర్యవేక్షించాలని అన్నారు. డివిజన్ ల వారీగా ఏసిపి అధికారులు డివిజన్ స్థాయిలో ప్రతినెల నేర సమీక్షలు నిర్వహించాలని అన్నారు. సిసిసి ద్వారా వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యత కల్పించి త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. ఆకస్మాత్తుగా తలెత్తే శాంతి భద్రతల సమస్యలను పరిష్కరించేందుకు సరైన లాఠీ, హెల్మెట్, మొదలగు వాటిని ఎల్లపుడు కలిగి వుండి సంసిద్ధంగా ఉండాలని అన్నారు. ఎస్‌హెచ్‌ఓ గా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ, ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు పోలీస్ స్టేషన్ మేనేజ్‌మెంట్ సక్రమంగా నిర్వహించాలని అన్నారు. పోలీస్ స్టేషన్, పరిసరాలు కనీస శుభ్రతను పాటించేలా చూడాలన్నారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సిసిటిఎన్ఎస్ లో పొందుపరచాలని, పెండింగ్ కేసులపై సమీక్ష చేసి వాటికి గల కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన వాటిని పూర్తి చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాదీనంలో ఉన్న వాహనాలు రికార్డుల్లో నమోదు చేయాలని అన్నారు. పట్టుబడి పోలీస్ స్టేషన్లలో వదిలివేయ బడిన వాహనాలను వేలం వేయుటకు పై అధికారులకు తెలపాల న్నారు. రికార్డ్ నిర్వహణ, సీసీటీఎన్ఎస్, రిసె ప్షను, కోర్టు డ్యూటీ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, బీట్, పెట్రోలింగ్, పా యింట్ బుక్‌ల ఏర్పాటు, సమన్లు మొదలుగు విధులను సమర్థవంతంగా నిర్వ హించాలని అన్నారు. డివిజన్ మొత్తాన్ని సెక్టార్లుగా విభజించాలని, ప్రతి సెక్టార్ కి గాను ఏఎస్ఐ లేదా హెడ్ కానిస్టేబుల్ లను ఇంచార్జ్ అధికారులుగా నియమించాలని, తిరిగి సెక్టార్లను, ఒకే మార్గంలో ఉండే రెండు మూడు గ్రామాలని కలిపి సబ్ సెక్టర్లుగా విభజించి వాటికి పోలీస్ కానిస్టేబుళ్లను కేటాయించాలని సూచించారు. దీని ద్వారా క్షేత్ర స్థాయిలో సమస్యలు తెలుసుకోవడంతో పాటు ప్రజలకు సేవలందించగలమన్నారు. రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలని అన్నారు. ప్రతి నెల వారికి సంబందించిన నూతన సమాచారం ఎప్పటికప్పుడు సేకరించి నమోదు చేసుకోవాలని అన్నారు. గంజాయి రవాణా, అక్రమ ఇసుక రవాణా, పిడిఎస్ బియ్యం, పేకాట స్థావరాలను గుర్తించి ఆడేవారిని పట్టుకోవడం వంటి వాటిని గుర్తించి తగిన కేసులు నమోదు చేసి, వాటిపై ఉక్కుపాదం మోపాలన్నారు. గంజాయిని నిర్మూలించేందుకు తీసుకునే చర్యల్లో భాగంగా స్థానిక పాఠశాల, కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేస్తూ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. సైబర్ నేరాల సంఖ్య రోజురోజుకి పెరుగుతున్నందున, వాటి బారిన పడకుండా ప్రజల్లో అవగాహన పెంచాలని, పెండింగ్ వారెంట్ల అమలు చేయాల న్నారు. రోడ్డు ప్రమాదాలపై చర్చించారు. తరుచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతా లను బ్లాక్ హోల్స్ గా గుర్తించి, రోడ్డు ప్రమాదాల నివారణకై చర్యలు చేపట్టాలన్నారు. డివిజన్ లోని పోలీస్ స్టేషన్లకు, అధికారులకు కేటాయిం చబడిన వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలను సక్రమంగా వాడుకోని, డ్రైవర్లకు ఎప్పటికప్పుడు సరైన శిక్షణ అందించాలని అన్నారు. రానున్న రోజుల్లో వచ్చే పండుగలైన రంజాన్, శ్రీరామనవమి, హనుమాన్ జయంతి దృష్ట్యా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తుతో పాటు తగిన భద్రతా పరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో హుజురాబాద్ ఏసిపి సిహెచ్ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు రవి (జమ్మికుంట), కిషోర్ (జమ్మికుంట రూరల్), వెంకట్ (హుజురాబాద్ రూరల్), సంతోష్ కుమార్ (సీసీఆర్బి), రమేష్ (సైబర్ సెల్), సరిలాల్ (ఐటీ కోర్) డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ల ఎస్ఐ లు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# బీర్పూర్ మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్

**జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**

బీర్‌పూర్ ప్రభాతవార్త:

జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలంలోనీ ప్రభుత్వం చేపడుతున్న పలు



అభివృద్ధి పనులను, ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్న గ్రామాలలో జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పర్యటించారు. మంగళవారం రోజున బీర్ పూర్ మండల కేంద్రంలోని పీ. హెచ్. సీ హెల్త్ సబ్ సెంటర్, చిత్రవేణి గూడెం గ్రామంలో ఇదిరమ్మ ఇండ్లు, తాళ్ళ ధర్మారం గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ ,కొల్వాయి గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ పలు నిర్మాణ దశలో ఉన్న పనులను క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. బీర్ పూర్ మండల కేంద్రంలో 1 కోటి 43 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న హెల్త్ సెంటర్ మరియు తాళ్ల ధర్మారం గ్రామంలో 20 లక్షల వ్యయంతో సబ్ సెంటర్ మరియు కొల్వాయి గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ 20 లక్షల వ్యయంతో చేపడుతున్న పలు నిర్మాణ దశలో ఉన్న పనుల పురోగతిని అధికారులతో కలిసి పరిశీలించారు. తాళ్ల ధర్మారంలో హెల్త్ సబ్ సెంటర్ పనులను ఏప్రిల్ నెల చివరి వరకు పూర్తిచేయాలని అన్నారు. మరియు కొల్వాయి గ్రామం సబ్ సెంటర్ పనులను 20 రోజుల్లో లోపు పూర్తిచేయాలని లక్షీ ్మదేవి పల్లిలోని గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ పనులను ఏప్రిల్ నెల చివరి నాటికి నిర్మాణం పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం బీర్పూర్ మండలం చిత్రవేణి గూడెం గ్రామంలోని పలు ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ స్థలాల పనుల పురోగతిని పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన నమూనా ప్రకారం మాత్రమే నిర్మించుకోవాలని నిర్మించుకున్న వారికి మాత్రమే దశలవారీగా ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఇండ్ల నిర్మాణ దశలో ఉన్న పనుల వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట డిపిఓ మధన్ మోహన్, డి.ఈ మిలిందు హౌసింగ్ డి.ఈ, ఎమ్మార్వో ముంతాజ్ బుద్ధిన్, గిరి దావర్ శ్రీనివాస్, ఎంపీఓ సలీం, డిప్యూటీ డిఎంహెచ్వో శ్రీనివాస్, సి హెచ్ ఓ కుదుస్, ఎలక్ట్రిక్ ఇంజనీర్ శ్రీనివాస్, జేఈ, హెల్త్ సూపర్వైజర్ కిషోర్ పవర్, కార్యదర్శులు లివిన్, ఆదిత్య, విజయ, ఎం ఎల్ హెచ్ పి రాహుల్, మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# బెల్టు షాపులతో పల్లెలకు కిక్కు

**కొనరావుపేట, ప్రభాతవార్త.**

పల్లెల్లో ఎక్కడ చూసినా బెల్ట్‌షాపులతో కిక్కు ఫుల్‌గా కనిపిస్తోంది. ఏ గ్రామంలో చూసినా... ఏ తండాలో చూసినా బెల్ట్‌షాపులు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. నిర్వహకులు అనుమతులు లేకుండా విచ్చలవిడిగా వ్యవహరిస్తున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా యువత మద్యానికి బానిస అవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. యువత మద్యానికి బానిసై నేరస్తులుగా మారి పలు కేసుల్లో చిక్కుకుంటున్నారు. తనిఖీలు చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు ముడుపులు తీసుకొని మౌనంగా ఉంటున్నారని గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కొనరావుపేట మండల పరిధిలో సుమారు 2500 మంది జనాభా ఉన్న ప్రతి గ్రామంలో 20 మద్యం బెల్ట్ షాపులు మూడు పువ్వులు ఆరు కాయలుగా జోరుగా సాగుతున్నాయి. అంటే ఈ తీరున ప్రతి 125 మందికి ఒక బెల్ట్ షాప్ ఉన్నట్లు లెక్క. గ్రామంలో నెలకొన్న 20 మద్యం బెల్ట్ షాపుల్లో ఎక్కువగా మద్యం విక్రయించేది మహిళలే కావడం కొస మెరుపు. అంతేగాకుండా ఒక్కో బెల్ట్‌షాపు నుంచి ఎక్సైజ్ శాఖలోని కొంత మంది అధికారులకు భారీగా ముడుపులు ఇస్తున్నట్లు గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్‌షాపుల నిర్వహకులే స్వయంగా ఆరోపిస్తున్నారు. అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా బెల్ట్ సాపులు నిర్వహిస్తున్న వారి వైపు ఎక్సైజ్ వాఖ అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో అంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నారనే సమాచారం తెలిపినా తూతూ మంత్రంగా తనిఖీలు చేపడుతూ అధికారులు చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇది ఇలా ఉంటే మరో వైపు బెల్ట్ షాపుల నిర్వహకులు క్వార్టర్‌పై రూ.20 నుంచి రూ.40, బీర్లపై రూ.30 నుంచి 50 వరకు అధికంగా వసూలు చేస్తూ దండుకుంటున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేగాకుండా బెల్ట్‌షాపులలో ప్రభుత్వ అనుమతి లేని మందులను కూడా సప్లై చేస్తారని మందుబాబులు ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్న పల్లెల్లో గానీ తండాల్లో గానీ బెల్ట్ షాపుల వైపు ఎక్సైజ్ శాఖ అధికారులు కన్నెతి చూడకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. ఇప్పటికైనా అబ్కారీ శాఖ అధికారులు బెల్ట్ దుకాణాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, పుట్టగొడుగుల్లా వెలుస్తున్న బెల్ట్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని, యువత, ప్రజలు మద్యానికి బానిస కాకుండా అరికట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

# కేటీఆర్‌ను విమర్శించే స్థాయి సునీల్ రావుకు లేదు

-అధికారం కోసం జోకే చరిత్ర సునీల్ రావు

-బిఆర్ఎస్ నగర అధ్యక్షుడు

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:



అత్యంత అవినీతి పరుడు ఎవరని గూగుల్ లో వెతికితే కరీంనగర్ మాజీ మేయర్ సునీల్ రావు పేరు వస్తుందనీ బిఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు హరిశంకర్ ఆరోపించారు. మంగళవారం కరీంనగర్ లో ఆయన ప్రెస్ మీట్ నిర్వహించి మాట్లాడారు...సునీల్ రావు ఉడుం సొచ్చినట్లు బీజేపీ లో సొచ్చిండన్నారు. బీజేపీ నాయకులు జాగ్రత్తగా ఉండాలనీ తెలిపారు.బిఆర్ఎస్ నేతలను విమర్శిస్తే ఖబడ్దార్,సునీల్ రావు నీ ఇంటిని ముట్టడిస్తామని చెప్పరు.స్మార్ట్ సిటీ లో బండి సంజయ్ పాత్ర లేదని బి.అర్.ఎస్ లో ఉన్నప్పుడు విమర్శించిన విషయం సునీల్ రావు మరిచి పోయావా అని ప్రశ్నించారు.కరీంనగర్ అభివృద్ధి మాజీ ఎంపీ వినోద్ కుమార్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ గారి తోనే సాధ్యమైందన్నారు. బి.అర్.ఎస్ ప్రభుత్వ హయంలోనే కరీంనగర్ అన్నివిధాల అభివృద్ధి చెందిన విషయం మంత్రి పొన్నం ప్రభాకర్ గారు గమనించాలన్నారు.15 నెలల కాలంలో మంత్రిగా పొన్నం ప్రభాకర్ కరీంనగర్ కు ఏం చేశారో చెప్పాలనీ డిమాండ్ చేశారు.తమ హయంలో జరిగిన అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో ఎక్కడికక్కడ ఆగిపోయిందన్నారు.కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఒక కార్పొరేటర్ లా మాట్లాడారన్నారు.కెసిఆర్ కు దొంగ నోట్ల ప్రింటింగ్ ప్రెస్ ఉంది అన్న విషయం బండి సంజయ్ కు ఎలా తెలిసింది,అందులో పని చేశారా అని ఎద్దేవా చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దగ్గర మెప్పు పొందేదుకే బండి సంజయ్ ఈ వ్యాఖ్యలు చేశారన్నారు.బండి సంజయ్ కు దమ్ముంటే కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల మీద మాట్లాడాలనీ హితవు పలికారు.కెసిఆర్ కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కాంగ్రెస్, బీజేపీ కలిసి డైవర్షన్ డ్రామాలు చేస్తున్నారనీ చెప్పారు.ప్రెస్ మీట్ లో బిఆర్ ఎస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి గడ్డం ప్రశాంత్ రెడ్డి, నగర యూత్ ప్రధాన కార్యదర్శి బోనకుర్తి సాయి కృష్ణ, నగర మైనార్టీ అధ్యక్షులు షౌకత్ ,నగర విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొంకూరి మోహన్,తదితరులు పాల్గొన్నారు..

# అల్ఫోర్స్ హై స్కూల్ బ్లాసూమ్ వార్షికోత్సవం

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:





విద్యార్థులకు సామాజిక అవగాహనతో పాటు నైతిక విలువల పట్ల అవగాహన పెంపొందించాలని తద్వారా సమాజంలో సముచిత స్థానాన్ని పొందుతారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు.మంగళవారం కరీంనగర్ లోని కిసాన్ నగర్ లో ఓ పంక్షన్ హాల్ లో"బ్లాసూమ్" పేరుతో నిర్వహించినటువంటి అల్ఫోర్స్ హై స్కూల్ (కిసాన్ నగర్) పాఠశాల వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు.విద్యార్థులు తప్పనిసరిగా తల్లిదండ్రులను నిర్దేశించినటువంటి లక్ష్యాలను చేరుకొని సమాజంలో అందరికీ ఆదర్శంగా ఉండాలన్నారు. సూచిస్తూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలో నేర్చుకున్నటువంటి విషయాలను ఎప్పటికప్పుడు సాధన చేస్తూ విషయాలలో పట్టు సాధించి సమాజంలో అగ్రగామిగా కొనసాగాలని చెప్పారు.విద్యార్థులు మరింత దృష్టి సారింప చేసి,మార్పులు అనుగుణంగా వ్యవహరిస్తూ అగ్రభాగాన ప్రముఖంగా నిలవాలని కోరారు.పలు దేశాలైన ఆస్ట్రేలియా, కెనడా, అమెరికాలో విద్యార్థుల సమయాన్ని సద్వినియోగం చేసుకుంటారని తెలిపారు.ఎప్పుడు కూడా దేశం అభివృద్ధి చెందాలనే తపనతో ఉంటారని, ప్రతి విద్యార్థి కూడా వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొనడమే కాకుండా విజయం సాధించాలని మరి లక్ష్యాలను నెరవేర్చుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు కూడా వారి పిల్లలను ఎప్పటికప్పుడు ఉత్సాహపరుస్తూ ముందుకు సాగాలని కోరారు.వేడుకలలో భాగంగా ఫలు పోటీ పరీక్షలలో నిలిచినటువంటి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రద్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు ఆలోచింపచేసాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, సిబ్బంది తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్ర సహాయక మంత్రి బండి సంజయ్‌పై ఫిర్యాదు

కరీంనగర్ టౌన్,ప్రభాత వార్త:



మాజీ సిఎం కెసిఅర్ పై,కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అనుచిత వాక్యాలు చేశారంటూ టౌన్ ఏసిపి వెంకట స్వామికి, బిఆర్ఎస్ గ్రంథాలయ మాజీ చైర్మన్ అనిల్ కుమార్ గౌడ్ పిర్యాదు చేశారు ఈనెల మార్చ్ 23న హైదారాబాద్ లోని నాంపల్లి బీజేపీ కార్యాలయం విలేకర్ల సమావేశంలో మాజీ సిఎం కెసిఅర్ పై బీదర్ లో నకిలీ కరెన్సీ ప్రింటింగ్ ప్రెస్ ఉందని , ఎన్నికల సమయంలో నకిలీ నోట్ల ఉత్పత్తి చేసి ఎన్నికల్లో నోట్లను పంపిణీ చేశారంటూ బండి సంజయ్ మీడియా తో మాట్లాడటాన్ని తప్పు పట్టారు.తెలంగాణ పై అప్పుల భారం మోపుతూ నకిలీ కరెన్సీ రాకెట్ ద్వారా సంపద ను కుదబెట్టుకున్నదని బండి సంజయ్ అని ఆరోపించారు. .ఈ ఆరోపణలు నిరాధారమైనవని అని, కెసిఅర్ కు,తన కుటుంబ పరువుకు భంగం కలిగేలా బండి సంజయ్ మాట్లాడారంటూ ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.

## వాలంటీర్ల జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం

కరీంనగర్ టౌన్,ప్రభాత వార్త:

నగునూరు, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్ గ్రామాలలో మూడు యూనిట్ల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి,బిల్ కలెక్టర్లు, కారబార్లు సూచించిన ప్రత్యేక ప్రదేశాలలో మూడు గ్రామాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విధిగా పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ పడాల తిరుపతి, డాక్టర్ కాంపల్లి అర్జున్ పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు.

## బకాయి ఆస్తి పన్నులు చెల్లించండి

-ఆస్తి పన్నుల చెల్లింపుకు ఆరు రోజులే గడువు

-కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్

కరీంనగర్ కార్పొరేషన్,ప్రభాత వార్త:ఆస్తీ పన్నులు చెల్లించి కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కి సహకరించాలని కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ పిలుపు నిచ్చారు. కరీంనగర్ నగరపాలక సంస్థ ఆస్తి పన్నుల వసూల్లలో భాగంగా మంగళవారం నగరంలోని పలు డివిజన్ లలో పర్యటించారు. రెవెన్యూ విభాగం అధికారులు సిబ్బంది తో కలిసి మొండి బకాయి దారుల ప్రాపర్టీలను సందర్శించారు. చాలా కాలంగా నగరపాలక సంస్థ ఆస్తి పన్నులు చెల్లించని బకాయి దారుల నుండి టాక్స్ కట్టించారు. ఆస్తి పన్నులు చెల్లించని కొంత మంది బకాయి దారులకు పన్నులు చెల్లించాలని... సకాలంలో చెల్లించకుంటే ప్రాపర్టీలను సీజ్ చేయడంతో పాటు నగరపాలక సంస్థ నల్లా కనెక్షన్లను తొలగిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే నోటీసులు జారీ చేసినా పన్నులు చెల్లించని బకాయి దారుల ప్రాపర్టీలను సీజ్ చేసి... ఆదీనంలోకి తీసుకున్నారు. మరో వైపు కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయం సమావేశ మందిరంలో రెవెన్యూ విభాగం అధికారులు, వార్డు ఆఫీసర్లతో సమీక్షా సమావేశం జరిగింది. ఆస్తి పన్నుల వసూళ్లలో భాగంగా రెవెన్యూ అధికారులు, వార్డు ఆఫీసర్ల వారిగా ప్రాపర్టీ టాక్స్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అసెస్మెంట్ ప్రకారం టార్గెట్ పూర్తి చేసేలా కలెక్షన్ వేగం పెంచాలని సలహాలు సూచనలు చేశారు. ఈ సంధర్భంగా కమీషనర్ చాహాత్ బాజ్ పాయ్ మాట్లాడుతూ ఆస్తీ పన్నుల చెల్లింపుకు ఇంకా ఆరు రోజుల గడువు మాత్రమే ఉందని గడువు లోగా ప్రజలు తమ ఆస్తీ పన్నులను చెల్లించాలని సూచించారు. పన్నులు చెల్లించని మొండి బకాయి దారుల పై పురపాలక చట్టం ప్రకారం చర్యలు తీస్కుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే నోటీసులు జారీ చేసిన బకాయి దారుల ఆస్తులను సీజ్ చేసి ఆదీనంలోకి తీస్కున్నట్లు తెలిపారు. పన్నులు కట్టని నివాస గృహాలకు నల్లా కలెక్షన్లు కూడ తొలగిస్తున్నట్లు తెలిపారు. నగర ప్రజలు పన్నుల వడ్డీ భారం పెంచుకొకుండ సకాలంలో పన్నులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ స్వరూప రాణీ, రెవెన్యూ విభాగం అధికారులు, ఆఫీసర్లు పాల్గొన్నారు.




## ఒలంపియాడ్‌లో అల్ఫోర్స్ విద్యార్థులకు అత్యుత్తమ ఫలితాలు

కరీంనగర్ రూరల్, ప్రభాతవార్త:



విద్యార్థులకు సామాజిక అవగాహన చాలా కీలకమని, సమాజం గురించి అవగాహన పెరుగుతుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా॥ వి. నరేందర్ రెడ్డి అన్నారు.మంగళవారం కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇటెక్నో స్కూల్లో నిర్వహించినటువంటి విద్యార్థుల అభినందన సభకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు.విద్యార్థులకు వివిధ స్థాయిలలో నిర్వహింపబడే పలు పోటీ పరీక్షలలో జనరల్ నాలెడ్జ్ చాలా కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. జి.కె. ప్రాముఖ్యతను దృష్టిలో పెట్టుకొని పాఠశాలలో వార్షిక విద్యాప్రణాళికలో భాగంగా ప్రత్యేక శిక్షణ ఇస్తూ ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తూ అందులో అత్యుత్తమంగా రాణించిన వారికి వివిధ పరీక్షలకు ఎంపిక చేస్తున్నామని చెప్పారు.ఈ క్రమంలో గత నెలలో ఖ్యాతిగాంచిన పోటీ పరీక్షల సంస్థ అయిన సిల్వర్ జోన్ ఫౌండేషన్ వారు నిర్వహించినటువంటి జోనల్ స్థాయి స్మార్ట్ కిడ్స్ జి.కె. ఒలంపియాడ్లో పాఠశాలకు చెందినటువంటి 10 మంది విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరచడమే కాకుండా జోనల్ స్థాయిలో ఘనవిజయాలు నమోదుచేసారని చెప్పారు.అందులోవి. ఆశ్రిత రెడ్డి , సి.హెచ్. సోహన్, పి. మయాంక్ రెడ్డి, సాగి శ్రీదాత్రి, యు. రితేష్,ఇ. లిఖిత్ కుమార్, ఇ. రాజ్ ఆరుష్ పటేల్, కె. తనీష్ రెడ్డి, కె. రిషిక్ లు జోనల్ స్థాయిలో మెడల్స్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కైవసం చేసుకున్నారని చెప్పారు.అత్యధిక పతకాలతో ఘనవిజయం కైవసం చేసుకునందుకు పుష్పగుచ్చాలతో పాటు జ్ఞాపికలను అందేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు నమోదు చేయాలని ఆకాంక్షి ంచారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

## జపాన్‌ఆసియా యువ విజ్ఞాన మార్పిడి కార్యక్రమానికి శుభశ్రీ ఎంపిక

కరీంనగర్ టౌన్, ప్రభాతవార్త:



జపాన్ఆసియా యువ విజ్ఞాన మార్పిడి కార్యక్రమానికి పారమిత విద్యార్థిని శుభశ్రీ ఎంపికైంది. కరీంనగర్‌కు చెందిన బాల శాస్త్రవేత్త,యువ ఆవిష్కర్త శుభశ్రీ సాహు, పారమిత హెరిటేజ్ పాఠశాల లో చదువుతు న్నప్పుడు రైతుల కోసం ఒక వినూత్న వ్యవసాయ యంత్రాన్ని రూపొం దించింది. శుభశ్రీ జపాన్ఆసియా యువ విజ్ఞాన మార్పిడి కార్యక్రమంలో పాల్గొనడానికి ఎంపికయ్యారని పారమిత విద్యాసంస్థల చైర్మన్ డా.ఇ.ప్రసాద రావు తెలిపారు. వారం రోజుల పాటు జరగబోయే ఈ కార్యక్రమానికి పూర్తిగా విద్యార్థి ఖర్చులను భారత ప్రభుత్వమే భరిస్తుందన్నారు.ఈ కార్యక్రమానికి ఎంపికైన శుభశ్రీ ని,మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా పాలనాధికారి పమేలా సత్పతి ప్రత్యేకంగా అభినందించారు. జూన్ 15 నుండి జూన్ 21 వరకు జపాన్‌లో జరగబోయే ఈ అంతర్జాతీయ కార్యక్రమంలో పాల్గొననుంది.దేశవ్యాప్తంగా మొత్తం 350 మంది విద్యార్థులు జాతీయ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ 350 మంది విద్యార్థులలో 31 మంది విద్యార్థులు మాత్రమే జాతీయ సైన్స్ ప్రదర్శన విజేతలుగా సత్కరించబడ్డారు. మొత్తం తెలంగాణ నుండి ఈ కార్యక్రమానికి జపాన్‌కు ఆహ్వానించబడిన ఏకైక అవార్డు గ్రహీత శుభ శ్రీ.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, అనుకర్ రావు, రష్మిత, టి.యస్.వి.రమణ, రాకేష్, ప్రాచీ, వి.యు.యం. ప్రసాద్. వినోద్ రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయుడు గోపీకృష్ణ, సమన్వయకర్తలు పాఠశాల సిబ్బంది, విద్యార్థిని శుభశ్రీ ని అభినందించారు.

# రుణమాఫీ విషయంలో రైతులను నయవంచన చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

## బిజెపి జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

*జమ్మికుంట/హుజూరాబాద్, ప్రభాత వార్త:*




రుణమాఫీ విషయంలో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం నయవంతన చేసిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం హుజురాబాద్ పట్టణంలో బిజెపి కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీ పై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు, వాస్తవ పరిస్థితులకు పొంతన లేకుండా ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పై చిత్తశుద్ధి ఉంటే రుణమాఫీపై శ్వేత పత్రం విడుదల చేయాలని, నేటికి జిల్లాలో వేలాది మంది రైతులు రుణమాఫీ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. జమిలి ఎన్నికల విధానంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఒకేసారి ఎన్నికలు జరుగుతాయని, ప్రజా ధనాన్ని వృధా కాకుండా కాపాడుకోవచ్చని అన్నారు. తరచూ ఎన్నికల వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయని, ప్రభుత్వ పాలనకు, సంక్షేమ పథకాల అమలుకు ఎన్నికల కోడ్ అడ్డంకిగా జమిలి ఎన్నికల విధానం దేశానికి కొత్తేమీ కాదని, 1967 సంవత్సరంలోనే వన్ నేషన్, వన్ ఎలక్షన్ లు జరిగాయని అన్నారు. జమిలి ఎన్నికలతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ఇవన్నీ కూడా ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే జమిలి ఎన్నికల విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి, విస్తృత చర్చ కార్యక్రమాలు చేపట్టడానికి బిజెపి కార్యకర్తలు తగిన కృషి చేయాలన్నారు. దేశ భవిష్యత్తు, అభివృద్ధి కోసం ఎంతో అవసరమైన జమిలి ఎన్నికల విషయంలో ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం చేస్తుందన్నారు. ప్రజలకు మేలు చేసే ఏ విషయాన్నైనా కాంగ్రెస్ వ్యతిరేకించడం అలవాటుగా మార్చుకుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ వాళ్ల జాతీయ నాయకత్వ బాటలోనే నడుస్తుందని అన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి, వారి జీవితాలతో చెలగాడమాడుతుందని అన్నారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలు, అడ్డగోలు వాగ్దానాలతో ప్రజలను నయవంచనకు గురి చేసిందని అన్నారు. అన్నం పెట్టే రైతన్నను కూడా తీవ్రంగా మోసం చేసిందని అన్నారు. రుణమాఫీ పై అనేక ఆంక్షలు, కోర్రిలు, నిబంధనలు పెట్టి రైతాంగాన్ని ఏడిపిస్తుందని అన్నారు. సాక్షాత్తు అసెంబ్లీ వేదికగా వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు లక్షల పై రుణం ఉన్న వారికి రుణమాఫీ వర్తించదని ప్రకటన చేసిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో అందరికి రుణమాఫీ చేస్తామని, నేడు కొందరికే రుణమాఫీ చేస్తూ రైతులను కాంగ్రెస్ సర్కార్ నట్టేట మోసం చేసిందని అన్నారు. ఈ సమావేశంలో బిజెపి పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు, కార్యక్రమ కో ఆర్డినేటర్స్ సబ్బని రమేష్, బొరగాల సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్, జిల్లా కౌన్సిల్ మెంబర్ రావుల వేణు, అంకటి వాసు, యాంసాని శశిధర్, యాళ్ల సంజీవ రెడ్డి, కొలిపాక శ్రీనివాస్, గంట సంపత్, కొలిపాక వెంకటేష్, మునిగంటి నాగరాజు, రాపాక రాజు, భాస్కర్ యాదవ్, వేముల హృతిక్, వెంకటేష్, నీలం రవీందర్, చెతర్ సింగ్, తాళ్లపల్లి దేవేంద్ర, సబ్బని మాధవి, మొలుగూరి అపర్ణ, కొలిపాక అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ లో మండల బాలల పరిరక్షణ కమిటి సమావేశం

*హుజూరాబాద్ టౌన్, ప్రభాత వార్త:*



మంగళవారం హుజురాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల బాలల పరిరక్షణ కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిటి బాధ్యులు మాట్లాడుతూ 18 సంవత్సరముల లోపు బాల, బాలికల హక్కుల రక్షణ, మెరుగైన సంరక్షణ కోసం బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం కేంద్ర, రాష్ట్రాలతో సంయుక్తంగా దేశమంతా సమగ్ర బాలల పరిరక్షణ పథకమును ప్రారంభించారని అన్నారు. ఈ పథకము పరిధిలోకి వచ్చు బాలలు తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, ఇంటి నుండి పారిపోయిన నిరాదరణకు గురవుతున్న పిల్లలు, బాల కార్మికులు, వీధి బాలలు, బాలబాలికల అక్రమ రవాణా, భిక్షగాలుగా మార్చడం కోసం అమ్మడం, తరలించడం లైంగిక వేధింపులకు గురవుతున్న బాలలు, బాలికలు, బాల్యవివాహాలు, మత్తు పదార్థాలు, మత్తు పానీయాలకు బానిసైన బాలలు, మొదలగు బాలబాలికలందరూ ఈ పథకం లోకి వస్తారని అన్నారు. 18 సంవత్సరాలు పూర్తికాని వారికి బాల్య వివాహాలు చేయడం వల్ల జరిగే అనర్థాలు తెలియజేయాలని అన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన, ప్రయత్నం చేసిన గాని చట్టపరమైన చర్యలు ఉంటాయన్న విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. దాని వల్ల బాల్యవివాహాలు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ తహశీల్దార్ కె. కనకయ్య, ఎంపిడివో తూర్పాటి సునీత, సిడిపిఓ సుగుణ, మున్సిపల్ కమిషనర్ కె. సమ్మయ్య, ఎంఈవో బి. శ్రీనివాస్, ఎంపివో సాగి సతీష్ కుమార్, ఏపిఎం తిరుపతి, ఏఎస్ఐ సిహెచ్ కమల, మండల సమైక్య అధ్యక్షురాలు సుజాత, హెల్త్ హెచ్ఈఓ విజేందర్ రెడ్డి, మైనార్టీ రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ కుమారస్వామి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు రాజశ్రీ, శిరీష, పద్మ, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి తిరుపతి, సోషల్ వర్కర్ రమేష్, పారా లీగల్ సరిత, మత పెద్దలు మహేష్, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 27న జమ్మికుంట అంగడి వేలం పాట



*జమ్మికుంట టౌన్, ప్రభాత వార్త:*

జమ్మికుంట పట్టణ అంగడి వేలంపాట మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ అధ్యక్షతన వశపుల వారం అంగడి, తై బజార్ ఫీజులు వసూలు చేసుకొనుటకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో 9 మంది మాత్రమే హాజరు కాగా కోరం లేకపోవడంతో వేలం పాట తిరిగి ఈనెల 27న గురువారం మధ్యాహ్నం 3 గంటలకు వేలం పాట నిర్వహించబడునని మున్సిపల్ కమిషనర్ ఎండి. ఆయాజ్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనదలచిన వారు కమిషనర్ పురపాలక సంఘం జమ్మికుంట పేరున ఏదైనా జాతీయ బ్యాంకు నుండి రెండు లక్షల రూపాయల డిపాజిట్ డిడి రూపకముగా ఈనెల 26న సాయంత్రం నాలుగు గంటల లోగా కార్యాలయంలోని పౌర సేవా కేంద్రంలో అందజేయాలని తెలిపారు. అదే విధంగా రెండు లక్షల రూపాయల సాల్వేన్సి సర్టిఫికెట్, నో డ్యూ సర్టిఫికెట్లు డిడి తో పాటు జతపరచాలని ఆయన తెలిపారు.

## బాలల పరిరక్షణ మండల కమిటి నియామకం

*జమ్మికుంట టౌన్, ప్రభాత వార్త:*



జమ్మికుంట ఎంపీడీవో కార్యాలయంలో బాలల పరిరక్షణ మండల కమిటిని నియమించారు. ఈ కమిటి యొక్క ముఖ్య ఉద్దేశ్యము 18 సంవత్సరముల లోపు బాల బాలికల హక్కుల రక్షణ, మెరుగైన సంరక్షణ కోసం బాలల న్యాయ చట్టం 2015 ప్రకారం కేంద్ర, రాష్ట్రాలతో సంయుక్తంగా దేశమంతా సమగ్ర బాలల పరిరక్షణ పథకమును ప్రారంభించబడింది. ఈ పథకము పరిధిలోకి వచ్చు బాలలు తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, ఇంటి నుండి పారిపోయిన నిరాదరణకు గురవుతున్న పిల్లలు, బాల కార్మికులు, వీధి బాలలు, బాలబాలికల అక్రమ రవాణా, భిక్షగాల్లుగా మార్చడం కోసం, అమ్మడం, తరలించడం లైంగిక వేధింపులకు గురవుతున్న బాలలు, బాలికలు, బాల్య వివాహాలు, మత్తు పదార్థాలు, మత్తు పానీయాలకు బానిసైన బాలలు, బాలబాలికలందరూ ఈ పథకంలోకి వస్తారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కిరణ్ ప్రకాష్, ఎంపీడీవో భీమేష్, ఎంఈఓ, సిడిపిఓ హుజూరాబాద్ ఐసిడిఎస్ సూపర్వైజర్లు రమాదేవి, శిరీష, చైల్డ్ ప్రొటెక్షన్ కమిటి తిరుపతి, రమేష్ ఏపిఎం, మత పెద్దలు, మండల సమైక్య అధ్యక్షురాలు, కెజీబీవీ ప్రిన్సిపాల్, వావిలాల పిహెచ్సి మెడికల్ ఆఫీసర్, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.




## హుజురాబాద్ లో ఆశా వర్కర్ల ధర్నా, మానవహారం

*జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:*



తమ సమస్యల సాధనకు ఛలో హైదరాబాద్ కు వెళ్ళిన ఆశాలను అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం హుజురాబాద్ లో ఆశా వర్కర్లు రోడ్డెక్కి నిరసన తెలిపి సిఐటియు ఆధ్వర్యంలో హుజురాబాద్ అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆశా వర్కర్లు మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపి, అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు లత మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. సోమవారం హైదరాబాద్ లో శాంతియుత ధర్నాకు ఆశా వర్కర్లు పిలుపునివ్వగా అక్రమ అరెస్టులతో అడ్డుకున్నారని అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. కనీస వేతనం 18 వేల రూపాయలను చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశ వర్కర్లకు ఉద్యోగం కల్పించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి హెల్త్ కార్డులు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కొప్పుల శంకర్, ఆశ వర్కర్ల సంఘం ఉపాధ్యక్షురాలు కాశేశ్వరపు పుష్పలత, జంగా రమాదేవి, ఎడుముల సుజాత, విజయలక్ష్మి, మదీన, ఉమ, సునీత, అరుణ, తునికి విమల, కవిత, కొక్కుల సునీత, స్వరూప, శారద తదితరులు పాల్గొన్నారు.

## న్యాయవాదుల విధుల బహిష్కరణ

*జమ్మికుంట/హుజురాబాద్, ప్రభాత వార్త:*



హైదరాబాద్ కు చెందిన న్యాయవాది ఇజ్రాయిల్ పై పాశవికంగా దాడి చేసి హత్య చేసిన హంతకున్ని కఠినంగా శిక్షించాలని కోరుతూ హుజురాబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోస్కుల శ్రీనివాస్ మాట్లాడుతూ న్యాయవాదులపై జరిగే దాడులను అరికట్టేందుకు న్యాయవాదుల పరిరక్షణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి మట్టెల తిరుపతి, ఉపాధ్యక్షులు బండి రమేష్, న్యాయవాదులు భగవాన్ రెడ్డి, విజయ రెడ్డి, ముక్కెర రాజు, శ్రీధర్ బాబు, లక్ష్మణమూర్తి, బత్తుల తిరుపతి, విక్రం, ముచ్చ దివ్య, భాను కిరణ్, హరికిషన్, రాజేష్, అనిల్, రవి, కళ్యాణ్, శ్రావణ్, జక్కుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శంభునిపల్లి అంగడి వేలం వాయిదా

*జమ్మికుంట రూరల్, ప్రభాత వార్త:*

జమ్మికుంట మండ లంలోని శంభుని పల్లి గ్రామంలో మంగళవారం నిర్వహించిన అంగడి వేలం వాయిదా పడినట్లు పంచాయతి కార్యదర్శి ఇంగిలే కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ధారించిన ధర రాకపోవడంతో వేలం పాటను రద్దుచేసి మళ్లీ ఈ నెల 28న ఉదయం 11.30 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వేలంలో కొత్తగా పాల్గొనదలిచిన వారు ఈ నెల 27న సాయంత్రం 4 గంటల వరకు రూ. 20 వేల డీడీ పంచాయతీ కార్యదర్శి, శంభునిపల్లి పేరున తీసి గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు.

# పేదలు నిర్మించుకున్న ఇండ్లకు ఇంటి నెంబర్లు, పట్టాలు ఇవ్వాలి

**- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**

**- సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాధర్నా**

గోదావరిఖని, ప్రభాతవార్త:



ప్రభుత్వ స్థలాల్లో పేదలు నిర్మించుకున్న ఇండ్లకు ఇంటి నెంబర్లు, పట్టాలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికై సిపిఎం పెద్దపల్లి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రామగుండం మున్సిపల్ కార్యాలయం వద్ద మహా ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హాజరయ్యారు. మహా ధర్నా కార్యక్రమంకు ముందు ఎన్టీపీసీ మేడిపెల్లి సెంటర్ వద్ద జాన్ వెస్లీకి స్వాగతం పలికి, అక్కడి నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీలో భాగంగా ఎఫ్‌సిఐ క్రాస్ రోడ్, మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు, రాజేష్ థియేటర్ వద్ద ఉన్న జ్యోతిబా పూలే విగ్రహానికి రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, రాష్ట్ర సీనియర్ నాయకులు బొజ్జా బిక్షమయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ పూలమాలలు వేశారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం వద్ద మహా ధర్నాను ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు పథకం తప్ప ఇంకేవి అమలు చేయలేదని అన్నారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లో పెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో కూడా రైతాంగాన్ని, విద్యను, వైద్యాన్ని, కార్మిక రంగాన్ని విస్మరించిందని అన్నారు. కేంద్ర బడ్జెట్‌లో కూడా పేదలకు ఒరిగిందేమీ లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా సంపన్నుల కోసం పని చేస్తున్నాయని అన్నారు. దేశంలో పేద, ధనిక అంతరాలు పెరిగిపోతున్నాయని, దీనికి కారణం పాలకులేనని విమర్శించారు. ధనిక, పేద అంతరాలు పెరగకుండా అందరూ సమానంగా ఉండేలా పోరాడాలని పిలుపు నిచ్చారు. అదేవిధంగా రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సిపిఎం ఆధ్వర్యంలో 3 సంవత్సరాల క్రితం భూపోరాటం చేసి 4 కేంద్రాలు ఏర్పాటు చేసి సుమారు ఆరు వందల మందికి ఇండ్ల స్థలాలు ఇప్పించడం జరిగిందని అన్నారు. వారు ఇప్పుడు ఇండ్లు కట్టుకొని నివసిస్తున్నారని, వారికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం పట్టాలు ఇవ్వాలని, ఇంటి నెంబర్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అప్పటి వరకు వారికి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సిపిఎం ఆధ్వర్యంలో కార్పొరేషన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు సర్వే చేశారని, వాటిని పరిష్కరించాలని, ఇప్పటికే అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని ఆయన అన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా సింగరేణి, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు, దీంతోపాటు బిల్డింగ్, ట్రాన్స్ పోర్ట్, హమాలీ తదితర అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ప్రజలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల్ని వెంటనే పరిష్కరించకుంటే భవిష్యత్తులో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు కనీస 26 వేలు వేతనాలు పెంచి వారు ఎదుర్కొంటున్న సమస్యల్ని వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం సింగరేణి పర్మినెంట్, కాంట్రాక్ట్, మున్సిపల్, భూ పోరాట కేంద్రాలను జాన్ వెస్లీకి వినతి పత్రాలు అందించారు. మహా ధర్నా అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌కి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఎ.మహేశ్వరి వ్యవహరించగా, రాష్ట్ర కమిటీ సభ్యులు బిక్షమయ్య, భూపాల్ స్థానిక సమస్యలపై, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వై.యాకయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వేల్పుల కుమారస్వామి, ఎ.ముత్యం రావు, ఎం.రామాచారి, జిల్లా కమిటీ సభ్యులు సారయ్య, శ్రీనివాస్, శంకర్, బిక్షపతి, శైలజ,గణేశ్, జ్యోతి, రవీందర్, అశోక్, నాయకులు నాగమణి, ఉపేందర్, సంజీవ్, లక్ష్మారెడ్డి, నాగలక్షి ్మ తదితరులున్నారు.

# వేసవిలో ఉద్యోగులు తగిన జాగ్రత్తలు పాటించాలి

**- ఆరోగ్య అధికారిని డాక్టర్ పద్మ**

**- వకీలుపల్లి గనిలో ఉద్యోగులకు అవగాహన**

యైటింక్లయిన్‌కాలనీ, ప్రభాతవార్త:

వేసవిలో సింగరేణి ఉద్యోగులు తగిన జాగ్రత్తలు పాటించాలని ఆరోగ్య అధికారిని డాక్టర్ పద్మ సూచించారు. సింగరేణి ఆర్జీ 2 ఏరియాలోని వకీలుపల్లి గనిలో ఉద్యోగులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో ఎండలోకి వెళ్లినపుడు లేతరంగు దుస్తులు, తలకు టోపీ లేదా తలపాగా ధరించాలని, వడదెబ్బ తగిలినపుడు తలనొప్పి, తల తిరగడం, వాంతులు కావడం, నీరసం, ఒళ్ళు నొప్పులు, కండరాల నొప్పులు వంటి లక్షణాల ఉంటాయని, వడదెబ్బ తీవ్రమైతే స్పృ కోల్పోయి అపస్మారక స్థితికి గురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. వడదెబ్బకి గురైన వ్యక్తిని నీడ ఉన్న ప్రదేశానికి తరలించి, అతని శరీరానికి గాలి తగిలేలా చూడాలని, అతను స్పృహలో ఉంటే ఓఆర్ఎస్ ద్రవం లేదా నిమ్మరసం లేక మజ్జిగని కొద్దికొద్దిగా తాగించాలని, వెంటనే వైద్యులను సంప్రదించి తగిన చికిత్స అందించాలని సూచించారు. వేసవికాలంలో నీళ్ల ఎక్కువగా తాగాలని, పుచ్చకాయ, కీర దోసకాయ, వంటివి తినాలని, తరచు నిమ్మరసం లేక మజ్జిగ లేదా కొబ్బరినీళ్ల తాగాలని సూచించారు.



మద్యపానం, శీతల పానీయాలు, మాంసం, వేపుడు వంటలు తీసుకోకూడదని తెలిపారు. ద్విచక్ర వాహన దారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అఫిషియేటింగ్ మేనేజర్ తిరుపతి, గని రక్షణ అధికారి రామ్ కుమార్, డివైపిఎం శ్యామ్ ప్రసాద్, ఫిట్ సెక్రటరీ రాజు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం

గోదావరిఖని, ప్రభాతవార్త:

రామగుండం కార్పొరేషన్ 11వ డివిజన్ సంజయ్ నగర్‌లో ఆలయ ఫౌండేషన్ ఉచిత కంటి ఆసుపత్రి ద్వారా శంకర ఐ హాస్పిటల్



ఇన్‌ఛార్జి పరికిపండ్ల రామ్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ సభ్యులు లంక సురేష్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరంను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లంక సురేష్ మాట్లాడుతూ ఆలయ ఫౌండేషన్ సేవలు మరింత విస్తరించాలని కోరుతూ వారు చేస్తున్న సేవలను కొనియాడారు. శిబిరం ద్వారా దాదాపు 300 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించారు. దాదాపు 100 మంది కంటి సమస్యలు ఉన్న రోగులను హైదరాబాద్ నానాక్ రామ్ గూడాలోని శంకర్ ఐ విజన్ సెంటర్‌కు తరలించారు. ఆలయ ఫౌండేషన్ సీఈవో తీట్ల రమేష్ బాబు, డిప్యూటీ సీఈవో కీర్తి నాగర్జున, అడిషనల్ సీఈవో మిట్టపల్లి రాజేందర్ కుమార్, హాస్పిటల్ ఇన్‌చార్జ్ పరికిపండ్ల రామ్, మాజీ కార్పొరేటర్ ఐత శివ, మహేష్ పటేల్, ఆలయ ఫౌండేషన్ వాలంటీర్స్ లంక నరేష్, గడ్డం రమేష్, దూడపాక సుకు మార్, జూడపాక సాగర్, వెంకటేష్, శ్రీనివాస్, బుల్లి సాగర్, కన్నా బెంజ్ తదితరులున్నారు.

# మహా శోభాయాత్రను విజయవంతం చేయాలని పిలుపు

ఓదెల ప్రభాతవార్త

పెద్దపల్లి జిల్లా కేంద్రం లో హనుమాన్ మందిరం హిందూ వాహిని పెద్దపల్లి శాఖ ఆధ్వర్యంలో శ్రీ రామ నవమి సందర్బంగా 06.04.2025 ఆదివారం సాయంత్రం నిర్వహిస్తున్న భారీ ర్యాలీకి ముఖ్య అతిథులుగా వస్తున్న వుత్సవా మూర్థులు రాధా మోహన్ దాస్ స్వామి , కొత్తకొండ శివానంద స్వామి లతో మహా శోభయాత్ర నిర్వహించబడును వేదిక పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బావి వద్ద హనుమాన్ నగర్ కావున ఓదెల మండలం నుండి వేలాదిగా తరలి వెళ్లి భారీ ర్యాలీని విజయవంతం చేయాలి అని హిందూ వాహిని మండల అధ్యక్షులు శాతల్ల కుమార్ పిలుపునిచ్చారు

# పెద్దపల్లి వార్త

## యువతి వివాహానికి నిత్యవసర సరుకుల అందజేత

గోదావరిఖని, ప్రభాతవార్త:



సింగరేణి ఆర్జీ 1 ఏరియాలోని ఓసిపి 5లో స్కావెంజర్‌గా పనిచేస్తున్న నిరుపేద మహిళ కూతురి వివాహానికి ఎఐటియుసి ఆర్జీ 1 వైస్ ప్రెసిడెంట్ మాదన మహేష్, ప్రాజెక్టు కార్యదర్శి గుర్రం ప్రభుదాస్‌ల ఆధ్వర్యంలో కార్మికుల నుంచి బియ్యం, ఆయిల్ క్యాన్లు, ఇతర నిత్యావసర వస్తువులు సేకరించి మంగళవారం విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి బ్రాంచి నాయకులు గండి ప్రసాద్, బోగ సతీష్ బాబు, ఓసిపి 5 నాయకులు చందా తిరుపతి, ఎడవల్లి రాజిరెడ్డి, ఉదయ భాను, రాయుడు, శ్రీనివాస్, సామల సత్యనారాయణ, భక్తి శ్రీనివాస్, వెంకటస్వామి, సోమ నర్సయ్య, పిడుగు శ్రీనివాస్, సమ్మయ్య, సురేష్, రాజేంద్రప్రసాద్, నర్మదా, అశోక్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## బట్టలు, పోషకాహారం అందజేత

గోదావరిఖని, ప్రభాతవార్త:



గోదావరిఖని ఇంద్రానగర్‌కు చెందిన నిరుపేద గర్భిణీ లాస్యకి గత ఏడు నెలలుగా నీడ స్వచ్ఛంద సంస్థ దాత యూనియన్ బ్యాంక్ ఉద్యోగి ఎస్.కరణ్ సహకారంతో పండ్లు, పోషకహారం అందిస్తున్నారు. కాగా గత 20 రోజుల క్రితం లాస్య పండంటి ఆడపిల్లకు జన్మనిచ్చింది. మంగళవారం వారి ఇంట్లో బారసాల కార్యక్రమం నిర్వహించి బట్టలు, పండ్లు, పోషకాహారం అందించారు. ఈ సందర్భంగా లాస్య కుటుంబం నీడ స్వచ్ఛంద సంస్థకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా నీడ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 9 మంది నిరుపేద గర్భిణి స్త్రీలకు సహాయం చేయడం జరిగిందని తెలిపారు. ఇక ముందు కూడా నీడ సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద గర్భిణీ స్త్రీలకు తప్పకుండా సాయం చేస్తామని, ఇంకా ఎవరైనా ఇలాంటి నిరుపేదలు ఉంటే నీడ స్వచ్ఛంద సంస్థను సంప్రదించాలని, తప్పక సాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ గౌడ్, దాతలు ఎస్.కరణ్, ఎలిగేటి సాయి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 27న జాబ్ మేళా నిర్వాహణ

**జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతి రావు**

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:

జిల్లాలోని నిరుద్యోగ యువకులకు అపోలో ఫార్మసీ లో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 27న గురువారం రోజున సమీకృత జిల్లా కలెక్టరేట్లో రూమ్ నెంబర్ 225 నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి వై. తిరుపతి రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీ సంస్థలో 50 ఫార్మసిస్ట్, ట్రైనీ ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్ ట్రైనీ పోస్టు ఖాళీగా ఉన్నాయని, ఫార్మసిస్ట్ ట్రైనింగ్ ఫార్మసిస్ట్ పోస్టులకు బీఫార్మసీ లేదా ఫార్మసీ డిప్లమా , ఫార్మసీ అసిస్టెంట్, రిటైల్ ట్రైనీ పోస్ట్ లకు 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, వీరి వయస్సు 18 నుంచి 35 లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు మార్చి 27న ఉదయం 11 గంటల సర్టిఫికేట్స్ జిరాక్స్ లతో సమీకృత జిల్లా కలెక్టరేట్ కు వచ్చి తమ పేరు నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8247656356, 8985336947, 8121262441 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి వై.తిరుపతిరావు ఆ ప్రకటనలో తెలిపారు.

# విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన గత కేసిఆర్ ప్రభుత్వం

### అసెంబ్లీ లోగత కెసిఆర్ ప్రభుత్వాన్ని ఎండగట్టిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**చొప్పదండి ప్రభాతవార్త,** అసెంబ్లీలో చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం గత కేసిఆర్ ప్రభుత్వం పై వృశ్చికపడ్డారు విద్యారంగాన్ని నిర్వీర్యం చేశారని అసెంబ్లీలో అన్నారు ఈ మేరకు ఆయన మాట్లాడుతూ కేజీ నుండి పీజీ విద్యను ప్రారంభిస్తా, కార్పొరేట్ కళాశాల కాళ్ల విరుస్తాం అని చెప్పి అధికారంలోకి వచ్చిన కెసిఆర్, గత దశాబ్ద కాలంలో విద్యా విధ్వంసానికి పాల్పడ్డాడని అన్నారు. కెసిఆర్ తీర్పుతో విద్యా వ్యవస్థ రెండు దశాబ్దాలు వెనక్కి వెళ్ళి. ది అని తెలిపారు అన్యువల్ స్టేటస్ ఆఫ్ ఎడ్యుకేషన్2024 ప్రకారం 2వ తరగతి నుండి 5వ తరగతి చదువుతున్న 82!! విద్యార్థులకు 2వ తరగతి బుక్స్ చదవడం రావడం లేదని , 8వ తరగతి చదువుతున్న 65!! మంచి విద్యార్థులకు బేసిక్ మ్యాథమెటిక్స్ పైన అవగాహన లేకుండా పోయిందన్నారు, బీహార్ జార్ఖండ్,ఛత్తీస్గఢ్ వంటి రాష్ట్రాల కంటే తెలంగాణ రాష్ట్రం విద్యావ్యవస్థలో అధమ స్థానంలో ఉందన్నారునేషనల్ అచీవ్మెంట్ సర్వేలో 3వ, 5వ, 8వ,10వ తరగతి విద్యార్థుల సామర్థ్యాన్ని రాష్ట్రాల వారిగా నిర్వహించే పరీక్షలో టాప్5 వరస్ట్ పర్ఫామెన్స్ రాష్ట్రాల్లో తెలంగాణను ఉంచిన ఘనత కేసిఆర్ కు దక్కుతుందన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో 201718 నుండి పర్ఫామెన్స్ ఆఫ్ గ్రేడింగ్ ఇండెక్స్ సూచిక ద్వారా రాష్ట్రాల విద్య వ్యవస్థ పనితీరుకు ర్యాంకులు కేటాయించడం జరుగు తుందని, ఈ ఇండెక్స్ ద్వారా తెలంగాణ రాష్ట్రం జాతీయలోనే అధమ స్థానంలో నిలిచింది అని తెలిపారు 2022 సూచిక ప్రకారం సెకండరీ విద్య తర్వాత డ్రాప్ అవుట్ లలో తెలంగాణ రాష్ట్ర మొదటి స్థానంలో ఉందని జాతీయస్థాయిలో ఈ సగటు 13.2!! గా ఉంటే,తెలంగాణ రాష్ట్రంలో 22.2!! గా ఉందన్న గత కేసీఆర్ ప్రభుత్వంలో ఆనాటి ప్రభుత్వ పెద్దలు నారాయణ,శ్రీ చైతన్య వంటి కార్పొరేట్ పాఠశాలలను ప్రోత్సహించి, ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేశారని తెలిపారు కెసిఆర్ హయంలో



విధ్వంసానికి గురైన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యకు అధిక నిధులు కేటాయించిందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బడ్జెట్లో విద్యాబి . వృద్ధికి రూ.23,108 కోట్ల రూపా యలను ప్రభుత్వం ప్రతిపాదించింది అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ లను ప్రారంభించాలని సంకల్పించి సీఎం రేవంత్ రెడ్డి చారిత్రక నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు ప్రభుత్వ సంక్షేమ హాస్టల్లో విద్యార్థుల డైట్ చార్జీలను 200 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుంది. గత ప్రభుత్వం 10 ఏళ్ల కాలంలో 8 వేల పై చిలుకు టీచర్ ఉద్యోగా లనే భర్తీ చేయగా, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 11 వేలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగులకు అండగా నిలిచిందన్నారు దశాబ్ద కాలంగా ఉపాధ్యాయ బదిలీలు, ప్ర మోషన్లు చేపట్ట లేదన్నారు, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధ్యాయులను బదిలీ చేయడంతో పాటు ప్రమోషన్లను కల్పించి ందన్నారు. విద్యా వ్యవస్థను పర్యవేక్షణ చేయడానికి గత ప్రభుత్వం హాయంలో డీఈవోలు, డిప్యూటీ డీఈవోలు, ఎంఈఓ లను నియమించలేదన్నారు. కేజీ టు పీజీ విద్య నేపంతో ప్రారంభించిన సంక్షేమ పాఠశాలల్లో వసతి సౌకర్యాలు సరిగా లేక విద్యార్థులు ఇబ్బంది పడ్డారని అన్నారు. ఆనాటి బిఆర్ఎస్ నాయకుల జేబులు నింపడానికి వారి కోళ్ల ఫారాలు, అభ్యభవనాల్లో పాఠశాలలను ఏర్పాటు చేసి విద్యార్థుల జీవితాలను పణంగా పెట్టింది ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం. అన్నారు గత దసరా సమయంలో టిఆర్ఎస్ నాయకుల కనుసన్నల్లో ఉన్న భవనాలకు అద్దె చెల్లించలేదని ధర్నాలు చేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ గ్రీన్ ఛానల్ ద్వారా భవనాలకు అద్దె చెల్లిస్తామని, పాఠశాలలు నడవకుండా చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించడంతో తిరిగి ప్రారంభించారని తెలిపారు. శాస్త్రీయ ప్రమాణాలు పాటించకుండా ప్రారంభించిన ఈ పాఠశాలలతో రాష్ట్రంలో ఉన్న జిల్లా పరిషత్, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలు చాలావరకు మూతపడ్డాయి, ఉన్న పాఠశాలల్లో సరైన విద్యార్థులు లేకుండా పోయిందన్నారు కెసిఆర్ హయంలో నిర్వీర్యమైన విద్యావ్యవస్థను తిరిగే గాడిలో పెట్టడానికి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు కులం,మతం,ఆర్థిక సంబంధం లేకుండా ప్రతి విద్యార్థికి విద్యను అందజేయడానికి ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ప్రారంభించాలని నిర్ణయించడం చారిత్రక నిర్ణయం అన్నారు. విద్య ద్వారానే జీవితానికి సార్థకత ఏర్పడుతుందన్న అంబేద్కర్ ఆలోచన విధానం మేరకు డబ్బులు ఉన్న పిల్లలకే ఐఐటీ,నీట్ అనే విధానం పోవాలనే గొప్ప ఆలోచనతో ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను ప్రారంభిస్తుంది అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన మధ్యాహ్న భోజనం బిల్లులను ప్రభుత్వం సకాలంలో చెల్లించకపోవడంతో నీళ్ల చారు అన్నం తినవలసి వచ్చింది. విద్యార్థులకు పౌష్టికరమైన ఆహారం అందించడానికి డైట్ చార్జీలను 200 శాతం పెంచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుంది.

## నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

### బిజెపి మండల శాఖ అధ్యక్షులు మొగిలి మహేష్

**చొప్పదండి ప్రభాతవార్త,** మండల పరిధిలో గత మూడు రోజుల క్రితం వడగండ్ల వర్షం రావడంతో రైతులు పండిస్తున్న వరి మొక్కజొన్న తదితర పంటలు నేలకొరిగి భారీగా రైతుల నష్టపోయారనిభారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు మొగిలి మహేష్ అన్నారు ఈ మేరకు మండల తహసిల్దార్ ఈ నవీన్ కుమార్ కు వినతిపత్రం అందజేసి మాట్లాడార.కాట్నపల్లి మల్లన్న పల్లె రుక్మాపూర్ గ్రామాలలోని రైతుల పొలాలను సందర్శించగా దాదాపు 500 ఎకరాల వరకు పంట నష్టం జరిగింది దీనిని రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ అధికారి ద్వారా చొప్పదండి మండలంలోని ప్రతి ఒక్క గ్రామాన్ని పర్యటించి నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకు ఎకరానికి 30 వేల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.ఈ కార్యక్రమంలో



కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి తోట కోటేష్ సింగిరెడ్డి భూమిరెడ్డి నరసింహారెడ్డి కిట్టు గౌడ్ పెద్ది వీరేశం రాజారామ్ జక్కుల అంజయ్య ఐలయ్య కుక్కల అంజయ్య సాదుల రమేష్ పాలోజి వెంకటరమణ కసాడి అఖిల్ ఎడ్ల సురేష్ బండారి సంపత్ చాతర్ల శ్రీనివాస్ తాళ్లపల్లి రవి తదితరులు పాల్గొన్నారు

## నవోదయ కు ఎంపికైన పెరుమండ్ల ప్రశస్తి

### అభినందించిన సీఐ ప్రకాష్ గౌడ్

**చొప్పదండి. ప్రభాతవార్త,** దక్షిణ భారతదేశంలో అగ్రగామిగా నిలుస్తూ అత్యున్నత ఫలితాలను ఇస్తున్న చొప్పదండి పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరవ తరగతిలో పెరుమండ్ల ప్రసస్తి ఎంపికయింది. మండల పరిధిలోని గుమ్లాపూర్ గ్రామానికి చెందిన పెరుమండ్ల అరుణ పరశురాముల దంపతుల కుమార్తె పెరుమాండ్ల ప్రశస్తి చొప్పదండి పట్టణంలోని రత్నసాగర్ కోచింగ్ సెంటర్లో శిక్షణ పొంది నవోదయకు ఎంపికయింది రత్నసాగర్ కోచింగ్ సెంటర్ వ్యవస్థాపకులు,డైరెక్టర్ భక్తు సాగర్ విద్యార్థులకు అత్యున్నత శిక్షణను ఇవ్వడంతో నవోదయ కు ఎంపిక అయింది చొప్పదండి సీఐ ప్రకాష్ గౌడ్ ఎస్సై మామిడాల సురేందర్ లు ప్రశస్తిని ప్రత్యేకంగా అభినందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యారంగంలో మరిన్ని అత్యున్నత ఫలితాలు సాధించి భవిష్యత్తులో మంచి స్థాయిలో ఉండాలని విద్యార్థికి సూచించారు ఈ కార్యక్రమంలో రత్నసాగర్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ శేఖర్ అక్షయ పాఠశాల కరస్పాండెంట్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు



# చొప్పదండి వార్త



## కొండగట్టు అంజన్న భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచాలి

మల్యాల, ప్రభాతవార్త



ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని కోరుతూ మంగళవారం సామాజిక కార్యకర్త బింగి మనోజ్ కుమార్ ఆలయ ఈవో శ్రీకాంతారావు కు వినతిపత్రం అందించారు, ప్రభుత్వాలు ఎన్ని మారిన కొండగట్టు అంజన్న భక్తుల కష్టాలు తీరడం లేదని ఆలయంలో సౌకర్యాలు లేకపోవడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నందున రాబోయే చిన్న హనుమాన్ జయంతి సందర్భంగా కూడా భక్తులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలని ఈ సందర్భంగా కోరారు, అంతేకాకుండా ఆలయానికి వచ్చే భక్తుల వద్ద వ్యాపారులు అధిక ధరలకు వస్తువులను విక్రయించి దండుకుంటున్నారని వాటిని నియంత్రించి జయంతి సందర్భంగా దీక్షల పరులకు, భక్తులకు శ్రీ స్వామివారి దర్శనం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కూడా ఈవోను కోరారు,

## కొండగట్టు లో శానిటేషన్ పనుల నిర్వహణపై సమీక్ష

మల్యాల, ప్రభాతవార్త



ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ఏప్రిల్ 11 నుండి 13 వరకు జరిగే చిన్న హనుమాన్ జయంతి ఉత్సవాల పురస్కరించుకొని ఆలయంలో శానిటేషన్ పనుల నిర్వహణపై మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి దేవాదాయ శాఖ అధికారులు కలిసి ఆలయ పరిసరాలుపరిశీలన జరిపారు, అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు, ఈ సందర్భంగా జయంతి ఉత్సవాలకు వేల సంఖ్యలో భక్తులు తరలి రానున్నందున ఆలయంలో ఎటువంటి పారిశుద్ధ లోపం ఏర్పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీకాంత్ రావు మల్యాల ఎంపీడీవో స్వాతి పంచాయతీ అధికారి ప్రవీణ్ తో పాటు శానిటేషన్ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు

## వార్డు బాలల పరిరక్షణ కమిటీ సమావేశం

చొప్పదండి ప్రభాతవార్త,



చొప్పదండి పట్టణంలో వార్డు బాలల పరిరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వ హించారు ఈ సందర్భంగా బాలల పరిరక్షణకు చేపట్టవలసిన అంశాలపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ శశి కిరణ్ మై అంగన్వాడి ఉపాధ్యాయులు ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు కమిటీ సభ్యులు పాల్గొన్నారు

# ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సమస్యలను తీర్చాలి

**- అక్రమ బెట్టింగ్, గేమింగ్ యాప్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలి**

**- జిల్లా ఎస్పీ మహేష్ బి గితే**

**- కొనరావుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ**

కొనరావుపేట, ప్రభాతవార్త.

ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా బాధితుల పట్ల తక్షణమే స్పందిస్తూ, ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలను తీర్చాలని జిల్లా ఎస్పీ మహేష్ బి గితే సూచించారు. మంగళవారం కొనరావుపేట పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలు, స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలు, స్టేషన్ పరిధిలో నమోదు అవుతున్న, నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ రికార్డులు పరిశీలించి, పెండింగ్ కేసులపై ఆరా తీసి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడి, వారికి కేటాయించబడిన విధులు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ బ్లూకోల్ట్, పెట్రోకార్ సిబ్బంది 100 డయల్ కాల్స్‌కి తక్షణమే స్పందిస్తూ వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు. అధికారులు, సిబ్బంది పెట్రోలింగ్ సమయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను, హిస్టరీ షీటర్స్‌లను అనుమానంగా తిరుగుతున్న వ్యక్తులపై నిఘా ఉంచుతూ తనిఖీ చేయాలని,



విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు, విలేజ్ పోలీస్ అధికారులు తరుచూ గ్రామాలు పర్యటిస్తూ ప్రజలతో మమేకం అవుతూ ప్రజలకు, యువతకు సైబర్ నేరాలపై, అక్రమ బెట్టింగ్, గేమింగ్ యాప్స్ వలన కలుగు అనర్థాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఎస్పీ వెంట సిఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి, ట్రైనీ ఎస్ఐ రాహుల్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

# నిర్మాణ దశలో ఉన్న అభివృద్ధి పనులు వేగవతంగా పూర్తి చేయాలి

**-ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ గ్రౌండింగ్ పనులను నిర్దేశిత గడువు లోగా పూర్తి చేసుకోవాలి**

**-జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్**

సారంగాపూర్ ప్రభాత వార్త :



నిర్మాణ దశలో ఉన్న అభివృద్ధి పనులు వేగవతంగా పూర్తి చేయాలి అని జిల్లా కలెక్టర్ బి .సత్య ప్రసాద్ పేర్కొన్నారు మంగళ వారం సారంగాపూర్ మండలంలో నీ లక్ష్మీ మ్రదేవి పల్లి గ్రామము లో నీ హెల్త్ సబ్ సెంటర్ పలు నిర్మాణ దశలో ఉన్న పనులను క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే గ్రామం లో20 లక్షల వ్యయంతో చేపడుతున్న పలు నిర్మాణ దశలో ఉన్న పనుల పురోగతిని అధికారులతో కలిసి పరిశీలించారు. లక్ష్మీ మ్రదేవి పల్లిలోని గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ పనులను ఏప్రిల్ నెల చివరి నాటికి నిర్మాణం పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన నమూనా ప్రకారం మాత్రమే నిర్మించుకోవాలని నిర్మించుకున్న వారికి మాత్రమే దశలవారీగా ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అవుతాయని కలెక్టర్ తెలిపారు.ఇండ్ల నిర్మాణ దశలో ఉన్న పనుల వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.కలెక్టర్ వెంట డిపిఓ మధన్ మోహన్, డిఈ మిలింద్ హౌసింగ్ డిఈ, ఎమ్మార్వో జమీర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పంట నష్టపోయిన రైతులను ఒక్క మంత్రి పరామర్శించలేదు

ఎమ్మెల్సీ రమణ

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



వడగళ్ల వానతో పంటలు నష్టపోయిన రైతులను ఒక్కమంత్రి కూడా పరామర్శించలేదని ఎమ్మెల్సీ రమణ పేర్కొన్నారుజిల్లా కేంద్రంలోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా బి ఆర్ ఎస్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎల్. రమణ నివాసం లో మంగళవారం ఎల్. రమణ , జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ బాధితులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసి అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్ రమణ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో కొద్ది రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానలతో రైతులు తీవ్రంగా నష్టపోతే ఏఒక్క మంత్రి కూడా రైతుల దగ్గరకు వెళ్లి పరామర్శించి భరోసా కల్పించలేదని కాంగ్రెస్ పార్టీ శ్రేణులపై మండిపడ్డారు., 16 నెలల కాంగ్రెస్ పాలనలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై బి.ఆర్.ఎస్ పార్టీ అసెంబ్లీలో మాట్లాడితే దాటవేసే ధోరణిలో ఉన్నారే తప్ప సమాధానం ఇచ్చే పరిస్థితిలో లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పులు విపరీతంగా పెరిగాయని, కాంగ్రెస్ 16 నెలల పాలనలో 1లక్ష 58 వేల కోట్ల రూపాయలు అప్పు చేశారని అన్నారు. భారతదేశ చరిత్రలో ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం ఇంత స్వల్పకాలంలో ఈ స్థాయిలో అప్పులు చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో రైతులు, చేనేత కార్మికుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతుందన్నారు. 2 లక్షల రైతు రుణమాఫీ చేశామని కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పుకుంటున్నారని, ఏ గ్రామానికి వెళ్లిన మాకు రుణమాఫీ జరగలేదని చాలా మంది రైతులు చెబుతున్నారని, ప్రభుత్వం మాత్రం అందరికి ఇచ్చామని చేతులు ఎత్తేసినట్లు కనబడుతుందన్నారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను బి.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర నాయకులు వెళ్లి పరిశీలిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ నాయకులు మాత్రం ఏఒక్కరు రైతుల దగ్గరకు వెళ్లడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అసమర్థత వల్ల సాగునీరు సరిగ్గా అందక, విద్యుత్తు సరిగా లేకా లక్షలాది ఎకరాల పంటలు ఎండిపోయిందన్నారు. కాంగ్రెస్ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు.జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ.... . కాంగ్రెస్ అసమర్థ పాలన వల్ల నీళ్లులేక పంటలు ఎండిపోతున్నాయి.. వడగండ్ల వాన వల్ల పంట నష్టం జరిగింది. రైతులను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలి రెండు లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది రైతుబంధు రూపంలో కేసీఆర్ రైతులకు నేరుగా సహాయం చేశాడు ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువు.. వడగండ్ల వాన వల్ల నష్టపోయిన రైతులకు వెంటనే ఆర్థిక సాయం చేసి ఆదుకోవాల కేంద్ర ప్రభుత్వంఫసల్ బీమా యోజన పథకాన్ని గ్రామాన్ని కేంద్రంగా తీసుకొని సక్రమంగా అమలు చేయాలని అన్నారు.. హైదరాబాదులోని ఎంఎంటీఎస్ హత్యాచార ఘటన చాలా దురదృష్టం రాష్ట్రంలో అందాల పోటీలు కాదు మహిళలకు భద్రత కల్పించాలని అన్నార.. కెసిఆర్ హయాంలో షీ టీం లతో రాష్ట్ర మహిళలకు భద్రత కల్పించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు.. నిన్న శాసనమండలిలో సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఉండగా మైక్ కట్ చేయడం అనేది మహిళలకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాల రాస్తున్నానానికి నిదర్శనమని అన్నారు... ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు గట్టు సతీష్, పుల్లల గంగాధర్ సాగర్ రావు మల్లేశం గంగారెడ్డి మల్లారెడ్డి రాజేశం పట్టణ , మండల బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# రాముని లగ్గం వైభవంగా నిర్వహిస్తాం

వేములవాడ, ప్రభాతవార్త.

వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 6 వరకు జరిగే శ్రీ రామనవమి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని ఆర్డీఓ రాజేశ్వర్ అన్నారు. రాజన్న ఆలయంలోని గెస్ట్‌హౌస్‌లో మంగళవారం ఆర్డీఓ అధ్యక్షతన ఆలయ అధికారులు, మున్సిపల్, పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ శ్రీ రామనవమి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని అన్నారు. ఉత్సవాలకు ఆర్టీసీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతామని అన్నారు. ఉత్సవాలు జరిగే రోజులలో విద్యుత్ సర



ఫరాలో ఆటంకం లేకుండా చూస్తామని అన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్ రెడ్డి, సిఐ వీరప్రసాద్, మున్సిపల్, వైద్య ఆరోగ్య అధికారులు పాల్గొన్నారు.




# చందుర్తిలో ఆశా కార్యకర్తల నిరసన

చందుర్తి: మార్చి 25 ప్రభాతవార్త:



ఆశా కార్యకర్తల అరెస్టు శోచనీయమని ఆశా కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు సిర్రం గాయత్రి అన్నారు. తమ సమస్యలను వినిపించేందుకు హైదరాబాదుకు తరలి వెళుతుండగా ఆశా కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆశ కార్యకర్తలు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. స్థిర వేతనం నెలకు రూ.18 వేల చొప్పున నిర్ణయించాలని డిమాండ్ చేశారు. శాసనసభ సమావేశాలు ముగిసేలోగా తమ డిమాండ్లు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం హైదరాబాద్ లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలను అడ్డుకోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నిబంధనలు బేఖాతారు, సీసీ రోడ్ల క్యూరింగ్ ఏది??

ఎండు గడ్డి కప్పి నాణ్యతకు పాతరేస్తున్నారు

చిగురుమామిడి, ప్రభాత వార్త :



చిగురుమామిడి మండలం లో గత నెల రోజుల నుండి కొనసాగుతున్న సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులు నిబంధనలు బేఖాతారు చేస్తూ, ఇష్టారాజ్యాంగ వేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇష్టమైన స్థలాల్లో, మా ఇష్టం అంటూ వేస్తున్నారనే మాటలు కూడా వినిపించడం గమనార్హం. పై చిత్రం లోని దృశ్యం చూడండి నవ్విపో వుదురు గాక. మండల కేంద్రం లోని గ్రామ పంచాయతీ ఆవరణం లో పోసిన సీసీ రోడ్డు క్యూరింగ్ నాణ్యత చూస్తే ఇట్టే అర్థం అవుతుంది. సీసీ పోసిన అనంతరం నాణ్యత ఎక్కువ రోజులు ఉండాలంటే దాని మీద మట్టి కట్టలు పోసి అందులో నీటిని నిలువ ఉంచాలి, రోజులో కనీసం ఒక్కసారైనా నీటిని నింపాలి. కానీ దీనికి విరుద్ధంగా ఎండు గడ్డిని పరిచి చేతులు దులుపుకుంటున్నారు. ఇలా గడ్డి వేస్తె రోడ్డు నాణ్యత మున్నాళ్ళ ముచ్చటే అవుతుందని, అప్పనంగా ప్రజా సొమ్ము వృథా అవుతుందని చిగురుమామిడి మండల ప్రజలు అంటున్నారు. తనిఖీ చేయాల్సిన అధికారులు పట్టించుకుంటే బాగుంటుందని ప్రజలు అంటున్నారు.

# నవోదయలో సీటు సాధించిన నాగారం గ్రామ విద్యార్థి

కొనరావుపేట, ప్రభాతవార్త.



కొనరావుపేట మండలం నాగారం గ్రామానికి చెందిన అప్పల రోహిత్ నవోదయలో సీటు సాధించారు.ఈసందర్భంగా రోహిత్ తల్లిదండ్రులు అప్పాల వనిత నాగభూషణం ఆనందం వ్యక్తం చేశారు. విద్య నేర్పిన గురువు తీగల వెంకటేశ్వర్లుకు రోహిత్ తల్లిదండ్రులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. నవోదయలో సీటు సాధించిన అప్పల రోహిత్‌ను గ్రామస్తులు అభినందించారు.

మంథని వార్త

# న్యాయవాదులపై దాడులను అరికట్టి న్యాయవాద రక్షణ చట్టం తేవాలి

**-హత్యకు గురైన న్యాయవాది ఇజ్రాయిల్ కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలి**

**- హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ**

మంథని ప్రభాతవార్త:



హైకోర్టు సీనియర్ న్యాయవాది, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇజ్రాయిల్ ను నడి రోడ్డుపై దారుణంగా హత్య చేసిన విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయవాద రక్షణ చట్టం తేవాలని హత్యకు గురైన న్యాయవాది కుటుంబాన్ని ఆదుకోవాలని హైకోర్టు న్యాయవాది, మంథని మాజీ ఉపసర్పంచ్ ఇనుముల సత్యనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని హైకోర్టు వద్ద వారికి నివాళులు అర్పించి, సీనియర్ న్యాయవాదులతో కలిసి హైకోర్టు విధులను బహిష్కరించి రోడ్డుపై ఆందోళన నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరస్తుడిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం అడ్వకేట్ అసోసి యేషన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో న్యాయవాద సంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులు, బెదిరింపులు రోజురోజుకి పెరుగుతున్నాయని, నాటి గట్టు దంపతుల నుండి నేటి ఇజ్రాయిల్ దాకా హత్యలు ఆగడం లేదని, దాడులు జరుగకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ బిల్లు వెంటనే ప్రవేశ పెట్టి చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు అడ్వకేట్ అసోసి యేషన్ అధ్యక్షులు ఎం. రవీందర్ రెడ్డి, సీని యర్ న్యాయవాదులు వి. రఘునాథ, చిక్కుడు ప్రభాకర్, రాపోలు భాస్కర్, నూతనంగా అధ్యక్షులుగా పోటీ చేస్తున్న జగన్ , పొన్నం రవీందర్ యాదవ్, ఎడ్ల రవి కుమార్ పటేల్, జూనియర్ న్యాయవాది నరేష్ రాథోడ్ తో పాటు అనేక మంది సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

---

# మంథనిలో విధుల బహిష్కరించిన న్యాయవాదులు

మంథని ప్రభాతవార్త:

హైదరాబాదులో న్యాయవాది ఇజ్రాయిల్ ను దారుణంగా హత్య చేసిన సంఘటనపై నిరసన తెలుపుతూ మంథనిలో న్యాయవాదులు మంగళవారం విధులను బహిష్కరించారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ పిలుపు మేరకు మంథనిలో న్యాయవాదులు అందరూ కలిసి ఇజ్రాయిల్ మృతికి సంతాపం తెలుపుతూ విధులను బహిష్కరించామని తెలిపారు. న్యాయవాదులపై దాడులు జరగడంతో పాటు హత్యలకు పాల్పడు తున్నారని న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని న్యాయవాదులు డిమాండ్ చేస్తూ మంథని న్యాయమూర్తికి బార్ అసోసి యేషన్ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబు, ఉపాధ్యక్షుడు రఘోత్తం రెడ్డి, ప్రధాన కార్యదర్శి సహేందర్ రెడ్డి, కోశాధికారి ఆంజనే యులు, న్యాయవాదులు శశికాంత్ కాచే, రమేష్ బాబు, భాస్కర్ రెడ్డి, చంద్రశేఖర్, శశిభూషణ్ కాచే, జంజర్ల శేఖర్, ఆర్ల నాగరాజు, సుభాష్, శ్రీనివాస్, వెంకటరామ్ రెడ్డి రాచర్ల రాజేందర్ తో పాటు తదితరులు పాల్గొన్నారు.



---

# లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

**జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి**

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:



గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం 1994 ప్రకారంలింగ నిర్ధారణ చేసి ఆడ ,మగ అని చెప్పడం చట్టరీత్యా నేరమని మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జగిత్యాల ఇన్చార్జి ఆర్డిఓ ఎన్ శ్రీనివాస్ తో కలిసి కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్నటువంటి , పాత స్కానింగ్ సెంటర్స్ రెన్యువల్ కొరకు దరఖాస్తు చేసుకున్న స్కానింగ్ సెంటర్లను, ఆసుపత్రులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు స్కానింగ్ సెంటర్లలో పేషంట్ల సౌలభ్యం కోసం కనీస వసతులు, వెంటిలేషన్ సౌకర్యం,వెయిటింగ్ హాల్, నిబంధనల ప్రకారం ఉన్నాయా అని చూశారు.స్కానింగ్ మిషన్స్ మరియు డాక్టర్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉన్నాయా అని సరిపోల్చారు. నిబంధనలకు లోబడి అన్ని సక్రమంగా ఉన్నట్లయితే ఆయా కేంద్రాల దరఖాస్తులను అనుమతి కొరకు సిఫారస్ చేస్తామని ఆర్డిఓ శ్రీనివాస్ తెలిపారు. ఫారం ఎఫ్ లు ప్రతినెల 5వ తారీఖు లోపు వారికి కేటాయించబడిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సబ్మిట్ చేయవలసిందిగా ఆదేశించారు. ఫారం ఎఫ్ లు ఆన్లైన్, ఆఫ్లైన్ ఒకే విధంగా ఉండాలన్నారు. లింగ నిర్ధారణ చేసేటప్పుడు పేషంట్లకు కనపడే విధంగా ఇక్కడ లింగ నిర్ధారణ చేయబడదు లింగ నిర్ధారణ చేసినచో కఠిన చర్యలు తీసుకోబడతాయి అను ఫ్లెక్సీ బోర్డులు , ఫోం బోర్డులు ఏర్పాటు చేయవలెనని డాక్టర్ జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ నిబంధనలు అతిక్రమించి లింగ నిర్ధారణ చేసినచో జరిమానా విధించబడమే కాకుండా గర్భిణీ మినహా ప్రోత్సహించిన వారిపై కూడా జరిమానా మరియు మూడు నెలల జైలు శిక్ష కూడా ఉంటుందని, వైద్యుల యొక్క రిజిస్ట్రేషన్ కూడా రద్దుపరిచబడతాయని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై నోటీసులు జారీ చేయ బడతాయి. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశం, హెల్త్ సూపర్వైజర్ ఇందివర శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

---

# టీయూడబ్ల్యూజే జగిత్యాల జిల్లా మూడవ మహాసభ సన్నాహక సమావేశం

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

టీయూడబ్ల్యూజే ఐజేయు జగిత్యాల జిల్లాశాఖకు త్వరలో జరగబోయే మూడవ మహాసభకు సంబంధించిన సన్నాహక సమావేశం జగిత్యాల జిల్లా కేంద్రం లోని ప్రెస్ క్లబ్ సొంత భవనంలో మంగళవారం సమావేశం జరిగింది రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె. సురేంద్ర కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎన్నికల కార్యాచరణ,నిర్వహణకు సంబంధించిన ఆహ్వాన కమిటీ నియమించారు ఈ కమిటీలో జాతీయ కౌన్సిల్ సభ్యులు , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులతోపాటు 9 మంది ప్రధాన పత్రికల స్టాఫ్ రిపోర్టర్లు ఈ కమిటీలో సభ్యులు గా,ఉంటారని తెలిపారు ఈ కార్యక్రమానికి, రాష్ట్ర నాయకుల వారి అనుకూల సమయం కేటాయించడం గురించి జిల్లా నాయకత్వం వారిని సంప్రదించి మహాసభ తేదీని ఖరారు చేయుటకు ఈ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చీటీ శ్రీనివాసరావు, ఏ.ప్రదీప్ కుమార్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎండి ఇమ్రాన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాల చారి, నక్క లక్ష్మణ్ యాదవ్, లతోపాటు జిల్లా కార్యవర్గ సభ్యులు, వివిధ మండలాల కు చెందిన ప్రెస్ క్లబ్ బాధ్యులు జిల్లాలోని స్టాఫ్ రిపోర్టర్లు తదితరులు పాల్గొన్నారు

---

# మూడపల్లి లో పోలీసు మీకోసం కార్యక్రమం

చందుర్తి మార్చ్ 25 ప్రభాతవార్త:

చందుర్తి మండలం మూడ పల్లి గ్రామంలో మంగళవారం రాత్రి పోలీస్ మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు, ఈ సందర్భంగా సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామంలోని శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు, యువత గంజాయికి దూరంగా ఉండాలన్నారు, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు, మైనర్లకు వాహనాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు, వాహనాలు నడిపేవారు తప్పకుండా డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ధరించాలన్నారు, గ్రామాల్లో ఏమైనా నేరాలు జరిగితే డయల్ 100 కు ఫోన్ చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో ఎస్సై అంజయ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

---

# మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలి

**- మండల వ్యవసాయాధికారిని అనూష**

ముత్తారం, ప్రభాతవార్త.

సబ్ మిషన్ ఆన్ అగ్రికల్చరల్ మేకనైజేషన్ (ఎస్ఎంఎఎం)లో భాగంగా ముత్తారం మండలంలో వ్యవసాయ యాంత్రీకరణకు గాను పరికరాల కోసం మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిని అనూష ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ యాంత్రీకరణ కింద సబ్సిడీలో చేతి పంపులు, బ్యాటరీ స్ప్రేయర్, పవర్ నాప్సాక్స్ స్ప్రేయర్, డిస్క్ హారో, కల్టివేటర్, ఎంబి ప్లవ్, కేజీ వీల్స్, రోటోపడ్లర్ సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్, రోటవేటర్, పవర్ విడర్ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల మహిళా రైతులు యంత్రాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

---

# వైభవంగా శ్రీ కోదండ రామాలయం బ్రహ్మోత్సవ ద్వితీయ వార్షికోత్సవం

ముత్తారం, ప్రభాతవార్త:

ముత్తారం మండలం లక్కారం గ్రామంలోని శ్రీ కోదండ రామాలయం ద్వితీయ బ్రహ్మోత్సవ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యజ్ఞాచార్యులు కె.శ్రీనివాసచార్యుల ఆధ్వ ర్యంలో స్వామివారి బ్రహ్మోత్సవం, కుంభాభిషేకం, అగ్నిప్రతిష్ఠ, పూర్ణా హుతి కార్యక్రమ ఆలను నిర్వహించారు. ఈ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకుపాత్రులయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి అత్తె చంద్రమౌళి, మాజీ సింగల్ విండో ఛైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాదాసి రమేష్, దొంతరవేన రాజయ్య, వీరగోని సారయ్య, వీరగోని రాజేశం, అరె సంజీవ్, సాతిని బాలయ్య, అరె లక్ష్మయ్య, కాశిపేట మధునయ్య, నాగుల మల్యాల మల్లేశం, రామగిరి రాజబాబు, బర్ల రాజగట్టయ్య, బర్ల శ్రీనివాస్, మాదాసి రాకేష్, గోపిశెట్టి వేణు, మదాసి సంతోష్ తదితరులున్నారు.

---

# 29 న తై బజార్ వేలం పాట

మంథని ప్రభాతవార్త:



మంథని పురపాలక సంఘం పరిధి లోని తై బజార్, స్లాటర్ హౌజ్ 2025-26 సంవత్సరము వరకు కాంట్రాక్టు ఇచ్చుటకు ఈనెల 29 శని వారము రోజున వేలం వేయడం జరుగుతుందని కమిషనర్ మనోహర్ తెలిపారు. తొలుత ఈనెల 24 న వేలంపాట నిర్వహించగా కావాల్సిన సంఖ్య లో దరఖాస్తులు రాకపోవడంతో ఈనెల 29కి వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. ఈ వేలములో పాల్గొనువారు తైబజారుకు రూ. 50 వేలు , స్లాటర్ హౌజ్ కు రూ. 10 వేలు విలువ గల ఏదేని బ్యాంక్ నుండి కమిషనర్ పురపాలక సంఘం మంథని పేరున తీయబడిన డి.డి.లు ఈనెల 28 శుక్రవారం సా. 400 గ.ల వరకు పురపాలక సంఘ కార్యాల యము నందు సమర్పించి వేలము లో పాల్గొ నాలని ఆయన కోరారు. ఇతర నియమ నిబంధనలకు నిమిత్తము కార్యాలయము నందు సంప్రదించాలని అయన తెలిపారు.

---

# టీఎన్జీవోలు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన అదనపు కలెక్టర్

జగిత్యాల బ్యూరో ప్రభాత వార్త:

జగిత్యాల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో టిఎన్జిఒ, ట్రెసా జగిత్యాల జిల్లా ఉద్యోగ సంఘాలు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అదనపు కలెక్టర్ బి. ఎస్. లత ప్రారంభించినారు. ఈ సందర్భంగా టిఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు మిర్యాల నాగేందర్ రెడ్డి , ట్రెసా జిల్లా అధ్యక్షులు యం.డి.వకీల్ మాట్లాడుతూ జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి విచ్చేస్తున్న ఉద్యోగులకు మరియు ప్రజలకు, సందర్శకులకు అందరికీ ఎండాకాలంలో చల్లని నీటిని అందించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని చెప్పారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీమతి బి. ఎస్. లత మాట్లాడుతూ టీఎన్జీవో మరియు ట్రెసా సంఘాలు సేవా కార్యక్రమాలు చేయటంలో ఎప్పుడూ ముందుంటాయన్నారు. మెట్పల్లి ఆర్డిఓ శ్రీనివాస్, టిఎన్జీఓ జిల్లా కార్యదర్శి అమరేందర్ రెడ్డి, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్, కలెక్టరేట్ ఏఓ. షాదబ్ హకీమ్, టీఎన్జీవో నాయకులు మహమూద్, సొహెద్ బాబు, రాజేశం, ఇడిఎం మమత, సువర్ణ, భాగ్య, ఉద్యోగులు పాల్గొన్నారు

# ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

**-అడ్డుకున్న గ్రామస్తులు -పరిశీలించిన తహసిల్దార్ -ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి**

గొల్లపల్లి ప్రభాతవార్త :



ప్రభుత్వ భూమికి హద్దులు ఏర్పాటు చేసుకుని కబ్జాకు యత్నించటంతో గ్రామస్తులంతా కలిసి అడ్డుకొని హద్దురాల్లను తొలగించి ప్రభుత్వ భూమిని కాపాడాలంటూ తాహసిల్దారు కు ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గొల్లపల్లి మండలంలోని ఇస్రాజి పల్లి గ్రామానికి చెందిన కందుకూరు తిరుపతి ప్రభుత్వ స్థలం సర్వేనెంబర్ 38 లో రెండు ఎకరాల పట్టా ఉందంటూ హద్దురాలను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి ప్రయత్నించాడని గ్రామస్తులు ఆరోపించారు. అట్టి భూమిలో గత కొన్ని సంవత్సరాలుగా ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని గ్రామస్తులు, రైతులు తెలిపారు. ప్రభుత్వ భూమి లో ఎవరికి ఎలాంటి పట్టాలు లేవని రైతులు తెలిపారు. అట్టి భూమిలో హద్దురాళ్ళు ఏర్పాటు చేయటంతో గ్రామస్తులంతా కలిసి హద్దురాల్లను తొలగించారు. గ్రామ రైతులు తాహసిల్దార్ కు సమాచారం అందించడంతో స్థలాన్ని తహసిల్దార్ వరందన్ పరిశీలించారు. సర్వే నెంబర్ 38 ప్రభుత్వ స్థలంలో ఎవరికి ఎలాంటి అనుమతులు, పట్టాలు ఇవ్వలేదని ప్రభుత్వ అనుమతి లేకుండా భూములను కబ్జా చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని కబ్జాకు యత్నించిన వ్యక్తిని తాహసిల్దార్ వరందన్ హెచ్చరించారు ప్రభుత్వ భూములను ఎవరు ఆక్రమించిన ఉపేక్షి ంచేది లేదని తెలిపారు. అనంతరం గ్రామస్తులు, రైతులు ప్రభుత్వ భూములను కాపాడాలంటూ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ధర్మపురి వార్త

## ఎరువుల దుకాణాల ఆకస్మిక తనిఖీ

**-డీలర్స్ ,ఈ పాస్ మిషన్ ద్వారానే తప్పని సరిగా ఎరువుల అమ్మకాలు జరుపాలి**

**- జిల్లా వ్యవసాయ అధికారి భాస్కర్**

ఎండపల్లి ప్రభాతవార్త:



మండలంలోని పిఎసిస్, అలాగే ప్రైవేట్ ఎరువుల దుకాణాలను మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ ఆకస్మిక తణిఖీ చేశారు. ఇందులో భాగంగా ఎరువుల నిల్వ వివరాలు, గొడౌన్స్ ని తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ డీలర్స్ తప్పనిసరిగా ఎరువులు ఈ పాస్ మిషన్ ద్వారానే అమ్మకాలు జరుపాలని తెలిపారు. రైతులు ఎరువుల కొనుగోలుకు వచ్చినపుడు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకుని రావాలని తెలిపారు. వీరి వెంట మండల వ్యవసాయాధికారి కామల్ల మహేష్ ఉన్నారు,

## ధర్మపురిలో ఆశా వర్కర్ల నిరసన

ధర్మపురి ప్రభాతవార్త:



ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆశా వర్కర్లు తహసిల్దార్ కార్యాలయం ముందు మంగళవారం నిరసన వ్యక్తం చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పల్స్ పోలియో, లెప్రసీ సర్వే విధులకు సంబంధించి పెండింగ్ డబ్బులను చెల్లించాలని, ప్రసూతి సెలవులను ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ. 5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే సమస్యల పరిష్కారం కోసం హైదరాబాదులో ధర్నా చేపట్టిన ఆశ వర్కర్లను అరెస్ట్ చేయడాన్ని వ్యతిరేకించారు.

## వాలంటీర్ల జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరం

కరీంనగర్ టౌన్, ప్రభాత వార్త:

నగునూరు, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్ గ్రామాలలో మూడు యూనిట్ల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొని పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి, బిల్ కలెక్టర్లు, కారబార్లు సూచించిన ప్రత్యేక ప్రదేశాలలో మూడు గ్రామాలలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విధిగా పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ పడాల తిరుపతి, డాక్టర్ కాంపల్లి అర్జున్ పర్యవేక్షణలో కార్యక్రమాలు నిర్వహించారు.

## జెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోమల్ల మహేష్

గోదావరిఖని, ప్రభాత వార్త:



బిజెపి పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా రామగుండం కు చెందిన కోమల్ల మహేష్ నియమితులయ్యారు. బిజెపి పెద్దపల్లి జిల్లా నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు కర్రే సంజీవరెడ్డి నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) నుంచి తన ప్రస్థానం ప్రారంభించిన కోమల మహేష్ ఏబీవీపీలో కళాశాల కార్యదర్శిగా, గోదావరిఖని పట్టణ కార్యదర్శిగా, గోదావరిఖని, మంథని బాగ్ ప్రముఖుగా, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా విద్యార్థి శక్తి ఇన్చార్జిగా పనిచేశారు. అనంతరం ఏబీవీపీ పూర్తి సమయ కార్యకర్తగా విశాఖపట్నం, నెల్లూరు జిల్లాలో నగర, జిల్లా సంఘటన కార్యదర్శిగా నాలుగు సంవత్సరాలు పనిచేశారు. యూత్ ఎగైనెస్ట్ కరప్షన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ గా జిల్లా అంతట జిపి యాత్ర నిర్వహించారు. ఏబీవీపీ స్కాలర్షిప్ ఉద్యమంలో భాగంగా 25 లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెక్రటేరియట్ ముట్టడిలో కీలక పాత్ర పోషించారు. బంగ్లాదేశ్ అక్రమ చొరబాటు దారులకు వ్యతిరేకంగా జరిగిన నిరసనలో చలో చికెన్ నెక్ కార్యక్రమంలో నెల రోజులపాటు భారత్, బంగ్లాదేశ్ సరిహద్దులో పర్యవేక్షణ చేశారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా ఏబీవీపీ పిలుపుమేరకు డిసెంబర్ 9 2009న అసెంబ్లీ ముట్టడిలో అసెంబ్లీ గేట్ వరకు వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా బీజేపీలో చేరి బీజేవైఎం లో ఉమ్మడి రాష్ట్ర కార్యదర్శిగా, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా, ఖమ్మం, వరంగల్, మంచిర్యాల జిల్లాల ఇన్చార్జిగా పని చేశారు. తెలంగాణ రాష్ట్రంలో టిఆర్ఎస్ వ్యతిరేకంగా అప్పటి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్రలో మెడికల్, రక్షణ విభాగాలలో ఇన్చార్జిగా వ్యవహరించి ఐదు యాత్రాలను విజయవంతం చేయడంలో కీలకపాత్ర పోషించారు. బిజెపి పార్టీ బలోపేత కోసం క్రియాశీలకంగా పని చేస్తూ అంచలంచలుగా ముందుకు సాగారు. కాగా, జిల్లా నూతన కార్యవర్గంలో ఆయనకు ప్రధాన కార్యదర్శి పదవి అప్పగించడం పట్ల జిల్లా కర్రె సంజీవరెడ్డికి, సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శిగా కోమల మహేష్ నియామకం పట్ల పలువురు ఆయనకు అభినందనలు తెలిపారు.

## కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వుల అందజేత

గోదావరిఖని, ప్రభాతవార్త:



సింగరేణి ఆర్జీ 1 ఏరియా పరిధిలో మెడికల్ ఇన్వాలిడేషన్, ఎన్సిడబ్ల్యూఎ ఉద్యోగుల డిపెండెంట్లు 29 మందికి యాజమాన్యం నుంచి జారీ అయిన కారుణ్య ఉద్యోగ నియామక ఉత్తర్వులను జిఎం డి.లలిత్ కుమార్ చేతుల మీదుగా జిఎం కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఉత్తర్వులు అందుకున్న వారిలో 27 మంది పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నారని జిఎం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వీరికి ఆర్జీ 1 ఏరియాలో పోస్టింగ్ ఇవ్వటం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు కూడా పనియే ప్రత్యేక్ష దైవంగా భావించి తమ విధులకు హాజరు కావాలని, అదే విధంగా ఉద్యోగ అవకాశం కల్పించిన తల్లిదండ్రులను గౌరవించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూజిఎం గోపాల్సింగ్, డిజిఎం పర్సనల్ మెనేజర్ కిరణ్ బాబు, సిఎంఓఎఐ అధ్యక్షులు బి.మల్లేష్, ఎఐటియుసి డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, బ్రాంచ్ సెక్రటరీ ఆరెల్లి పోశం, పర్సనల్ మెనేజర్ రవీందర్ రెడ్డి, సీనియర్ పిఓలు హనుమంత రావు, శ్రావణ్ కుమార్, నాయకులు రంగు శ్రీను, సంతోష్ తదితరులున్నారు.

## ఆశ వర్కర్ల నిరసన

గొల్లపల్లి ప్రభాతవార్త :



తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతు హైదరాబాద్ లో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ వర్కర్లను అరెస్టు చేయడం పట్ల గొల్లపల్లి మండల ఆశ వర్కర్లు మండల పరిషత్ ఆఫీసు వద్ద నిరసన వ్యక్తం చేశారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం హైదరాబాదులో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న ఆశ వర్కర్లను అరెస్టు చేయడం దుర్మార్గమని గొల్లపల్లి మండల ఆశ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు చెవులమద్ది సుగుణ అన్నారు. రాష్ట్ర అధ్యక్షురాలు పి. విజయలక్ష్మి ్మ పిలుపు మేరకు మండల కేంద్రం లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుగుణ మాట్లాడుతూ కనీస వేతనం 18 వేలు ,ఉద్యోగ భద్రత, ఇ పి ఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, అర్హులకు ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించే బిల్లును ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రవేశపెట్టాలని కోరారు. ఈ నిరసనలో జంగిలి అంజలి, స్వప్న, జమున, మల్లేశ్వరి, గొర్రె నిర్మల ఇతర ఆశ వర్కర్లు పాల్గొన్నారు

## సన్ రైస్ వారి ఉచిత క్యాంపు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో

ధర్మారం ప్రభాతవార్త:



ధర్మారం మండలం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బొమ్మ రెడ్డి పల్లి గ్రామంలో ఈరోజు జరిగిన సన్ రైస్ హాస్పిటల్ కరీంనగర్ సౌజన్యంతో నిర్వహించబడిన ఉచిత క్యాంపుకు అధిక సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, భారీగా రావడంతో చాలా సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోక్యాంపులో లయన్ ప్రెసిడెంట్ రవీందర్ శెట్టి , క్యాంప్ కమిటీ చైర్మన్ లయన్ పుచ్చకాయల మునీందర్ రెడ్డి, లయన్ లెజెండ్ చైర్మన్ తన్నీరు రాజేందర్, జిల్లా కోఆర్డినేటర్ లయన్ సామ ఎలారెడ్డి, లయన్ మెంబర్స్ అక్కనపల్లి చంద్రయ్య, కాంగ్రెస్ మండల ప్రెసిడెంట్ గాగిరెడ్డి తిరుపతిరెడ్డి గ్రామ ప్రజలు మరియు డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై అవగాహన

గోదావరిఖని, ప్రభాతవార్త:

గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ, పీజి కళాశాలలో వన్ నేషన్ వన్ ఎలక్షన్‌పై



కార్యక్రమ జిల్లా కన్వీనర్ సొమారపు లావణ్య ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు, విద్యార్థులు రాజకీయ పరంగా దేశంలో జరుగుతున్న మార్పుల పట్ల, ప్రభుత్వాలు నడుపుతున్న విధివిధానాల పట్ల అవగాహన, ౘచెతన్యం కలిగి ఉండాలని, దేశ భవిష్యత్తు యువతపైన ఆధారపడి ఉందని, వన్ నేషన్ వన్ ఎలక్షన్ ప్రజల శ్రేయస్సు కోసమని, ప్రజలు మద్దతుగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ౘజెకిషన్ ఓజ్వల్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ సుల్వ లక్ష్మి ్మనారాయణ, పద్మ, మండల్ కన్వీనర్ మంజుల గుండ్ల, మహిళా కన్వీనర్స్ స్వరూప, కోమల స్వామి తదితరులున్నారు.

# చట్టబద్ధంగా మంచి పని చేసినప్పుడు తప్పక గుర్తింపు

**-గంజాయి నియంత్రణకు పటిష్టమైన నిఘా వ్యవస్థ -రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

పెద్దపల్లి జిల్లా బ్యూరో, ప్రభాతవార్త:




ప్రతి ఒక్క పోలీస్ అధికారి చట్టబద్ధంగా పనిచేయాలని, మంచిగా పని చేసినప్పుడు తప్పుక గుర్తింపు వస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. నెలవారి సమీక్షలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, గోదావరిఖని, మంచిర్యాల సబ్ డివిజన్ పోలీస్ అధికారులతో పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా కమిషనరేట్ కార్యాలయంలో మంగళవారం నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. డిసిపిలు,!! అడిషనల్ డిసిపి అడ్మిన్, ఎసిపిలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్, డివిజినల్, జోన్లవారిగా పెండిరగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్‌కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై పోలీస్ కమిషనర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమ్మోదైన గ్రేవ్ కేసులు, మహిళలపై నేరాలు, ఆస్తి నేరాలు, పోక్సో కేసులు, మిస్సింగ్, గంజాయి, రోడ్డు ప్రమాదాల కేసులకు సంబంధించి సమాచారంతోపాటు, కేసుల పరిష్కారం కోసం ఏ విధమైన చర్యలు తీసుకోవడం జరిగిందని తదితర అంశాలపై



పోలీస్ కమిషనర్ పోలీస్ స్టేషన్ వారిగా పోలీస్ అధికారులతో సమీక్ష జరిపారు. అదేవిధంగా నేరాల నియంత్రణ కోసం అధికారులు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పోలీస్ కమిషనర్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే కార్యకలాపాలపై స్టేషన్ అధికారులకు ముందస్తు సమాచారం ఉండాలని, ప్రతి కేసులో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని, ఎస్సీ, ఎస్టీ కేసులలో న్యాయపరంగా, పారదర్శకంగా విచారణ జరపాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో అధికారులకు, సిబ్బందికి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని రకాల సమాచారంపై అవగాహన ఉండాలని, విలేజ్ పోలీస్ ఆఫీసర్స్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని, సమాచార వ్యవస్థను పటిష్టం చేయాలని, సిసి కెమెరాలు జరిగే విషయాలను గుర్తించడం జరుగుతుందని, అదే ప్రజలతో మంచి సత్సంబంధాలను కొనసాగిస్తే బయట చర్చ జరిగే ప్రతి ముందస్తు సమాచారం తెలుస్తుందని అన్నారు. దొంగతనాలు జరగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, ప్రధాన చోరీలకు పాల్పడిన నేరస్థులను గుర్తించడంతోపాటు చోరీ సొత్తును స్వాధీనం చేసుకోవాలని సూచించారు. ప్రతి రోజు ఒక రెండు గంటలపాటు పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులకు, బాధితులకు కేటాయించాలని, రెండు గంటలు పెండిరగ్ కేసులను సమీక్షా జరపాలని, ఏ్కదైనా సంఘటన జరిగినప్పుడు, బాధితులు ఫిర్యాదు చేసినప్పుడు సంఘటన స్థలానికి తప్పనిసరిగా వెళ్ళాలని, అప్పుడు క్షేత్రస్థాయిలో సమాచారం లభిస్తుందని అన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో విలేజ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేయాలని, కిందిస్థాయి సిబ్బందితో మర్యాదగా ఏలాంటి భేదాలు లేకుండా ప్రవర్తించాలని, పోలీస్ శాఖ ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించినట్లయితే శాఖ పరమైన చర్యలు తప్పవని అన్నారు. గంజాయి నియంత్రణకు పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేయాలని, రవాణా చేసే వారిని గుర్తించాలని, కేసులు నమోదు చేయాలని, గంజాయి సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని ఎంతటి వారైనా ఉపేక్షి ంచేది లేదని హెచ్చరించారు. ఈ సందర్భంగా గంజాయి స్వాధీనం కేసులలో ప్రతిభ కనబరిచిన అధికారులకు, సిబ్బందికి పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో మంచిర్యాల డిసిపి ఎ.భాస్కర్, పెద్దపల్లి డిసిపి కరుణాకర్, అడిషనల్ డిసిపి అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఎసిపి రాఘవేంద్ర రావు, గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్, పెద్దపల్లి ఎసిపి జి.కృష్ణ, ట్రాఫిక్ ఎసిపి నరసింహులు, ఎసిపి మల్లారెడ్డి, ఎఆర్ ఎసిపి ప్రతాప్, ఎఓ శ్రీనివాస్, సిఐలు, వివిధ వింగ్స్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలి

**- కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు సమకూర్చాలి - రైతులకు అవగాహన కల్పించాలి - కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్,ప్రభాతవార్త:



యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కొనుగోలు కమిటీ సభ్యులను కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు.యాసంగి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జిల్లా కొనుగోళ్ల కమిటీ సభ్యులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ధాన్యం పూర్తిగా పరిపక్వతకు వచ్చిన తర్వాతనే హార్వెస్ట్ చేసేలా రైతులకు, హార్వెస్టింగ్ మిషన్ ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కోతలకు సంబంధించి రెవెన్యూ గ్రామాల వారీగా నిర్దిష్ట ప్రణాళిక ఏర్పాటు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకపు యంత్రాలు, తేమను కొలిచే యంత్రాలు, గన్ని సంచులు, తార్పాలీన్ కవర్లు వంటివి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఉన్న ప్యాడి క్లీనర్ లతో పాటు మరో 15 ప్యాడి క్లీనర్ లను కొనుగోలు చేయాలని సూచించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు తర్వాత వెన్ వెంటనే వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. రైతుకు సకాలంలో సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల ధాన్యాలు వేరువేరు ప్రదేశాల్లో ఉండేలా చూడాలని సూచించారు. ఎండాకాలం దృశ్య రైతులకు నీడ, తాగునీటి సౌకర్యం ఉండేలా చూడాలని తెలిపారు. సిబ్బంది కొనుగోలు రిజిస్టర్ ను అందుబాటులో ఉంచుకోవాలని, పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. తేమ యంత్రాన్ని నీడలోనే ఉండేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్షీ ్మ కిరణ్, డిఆర్ఓ వెంకటేశ్వర్లు, ఆర్డీవో మహేశ్వర్,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసిన కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

వేములవాడ, ప్రభాతవార్త:

రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు రాపోలు జయ ప్రకాష్, తిరుమలగిరి సురేం దర్ జిల్లా పర్యటనకు రాగా, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మంగళవారం రాజన్న ఆలయ అతిథి గృహంలో మర్యాద పూర్వంగా కలిశారు. బుధవారం కమిషన్ చైర్మన్, సభ్యులు సిరిసిల్ల, వేములవాడలో పర్యటించనున్న సందర్భంగా వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గెస్ట్‌హౌస్‌కు చేరుకోగా, కలెక్టర్ వారికి పుష్ప గుచ్చం అందజేశారు. బుధవారం ఉదయం కమిషన్ చైర్మన్



స్వామివరిని దర్శిం చుకొని జగిత్యాల వెళ్లనున్నారు. ఈ కార్యక్రమంలో వేము లవాడ ఆర్డీఓ రాజేశ్వర్, ఆలయ ఈవో వినోద్ రెడ్డి, జిల్లా బిసి సంక్షేమ అధికారి రాజమనోహార్ రావు తదితరులు న్నారు.

# నిర్మాణ దశలో ఉన్న అభివృద్ధి పనులు వేగవతంగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్**

సారంగాపూర్ ప్రభాత వార్త :



నిర్మాణ దశలో ఉన్న అభివృద్ధి పనులు వేగవతంగా పూర్తి చేయాలి అని జిల్లా కలెక్టర్ బి .సత్య ప్రసాద్ పేర్కొన్నారు మంగళ వారం సారంగాపూర్ మండలంలో నీ లక్షీ ్మదేవి పల్లి గ్రామము లో నీ హెల్త్ సబ్ సెంటర్ పలు నిర్మాణ దశలో ఉన్న పనులను క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే గ్రామం లో20 లక్షల వ్యయంతో చేపడుతున్న పలు నిర్మాణ దశలో ఉన్న పనుల పురోగతిని అధికారులతో కలిసి పరిశీలించారు. లక్షీ ్మదేవి పల్లిలోని గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ పనులను ఏప్రిల్ నెల చివరి నాటికి నిర్మాణం పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన నమూనా ప్రకారం మాత్రమే నిర్మించుకోవాలని నిర్మించుకున్న వారికి మాత్రమే దశలవారీగా ప్రభుత్వం నుండి నిధులు మంజూరు అవుతాయని కలెక్టర్ తెలిపారు.ఇండ్ల నిర్మాణ దశలో ఉన్న పనుల వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశించారు.కలెక్టర్ వెంట డిపిఓ మధన్ మోహన్, డిఈ మిలింద్ హౌసింగ్ డిఈ, ఎమ్మార్వో జమీర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబును కంట తడి పెట్టించిన క్యాన్సర్ బాధితుని మాటలు

**-బాధితుని కోరిక మేరకు క్రికెట్ కిట్ అందజేత**

**-అన్నగా అండగా ఉంటానని భరోసా**

మంథని ప్రభాతవార్త:



సార్, నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. పెద్ద క్రికెటర్ కావాలని కలగన్నా.. నాకో క్రికెట్ కిట్ ఇప్పించండి సార్ క్యాన్సర్ తో పోరాడుతున్న ఓ యువకుడి మాటలివి. ఆ మాటలు విన్న మనసున్న ప్రతీ మనిషికీ గుండె చెమర్చక మానదు. ఈ మాటలకే మంత్రి శ్రీధర్ బాబు ఏకంగా కంట తడి పెట్టుకున్నారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి మంథని నియోజకవర్గంలోని పలిమల మండలం సర్వాయ్ పేట గ్రామానికి చెందిన భౌత్ నితిన్ క్యాన్సర్ తో బాధపడుతూ ఖాజగూడలోని స్పర్ష్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి శ్రీధర్ బాబు మంగళవారం ఆసుపత్రి కెళ్లి పరామర్శించారు. నేనున్నానని భరోసా నిచ్చారు. బాధితుడు మంత్రి శ్రీధర్ బాబు చూడగానే తనకున్న కోరికను శ్రీధర్ బాబుతో కన్నీళ్లు పెట్టుకుంటు చెప్పడంతో నితిన్ మాటలకు కంట తడి పెట్టుకున్న మంత్రి శ్రీధర్ బాబు అప్పటికప్పుడు క్రికెట్ కిట్ తెప్పించి అతని కోరికను నెరవేర్చారు. తాను సొంత ఆన్నగా వెంట నిలుస్తానని, ఏ అవసరమున్నా నేరుగా నన్ను సంప్రదించండి అంటూ నితిన్ తల్లిదండ్రులకు మంత్రి ధైర్యం చెప్పారు.

# అంబేద్కర్ విగ్రహం ముందు ఆశా వర్కర్ల నిరసన

**కొనరావుపేట, ప్రభాతవార్త.**

కొనరావుపేట మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు ఆశా వర్కర్లు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించడం లేదని, తమతో వెట్టి చాకిరి చేయిస్తూ శ్రమకు తగ్గ వేతనం చెల్లించడం లేదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని. 19వేల రూపాయల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.